సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
ఆదివారం, 05.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 163
పేజీలు: 12 వెల: రూ. 5

# పాక్‌పై దాడికి రె'ఢీ'



- పాక్‌లో తీవ్ర సంక్షోభం..
- భారత్ వ్యూహాత్మక అడుగులు
- రాజ్‌నాథ్ భేటీలు, మాక్ డ్రిల్స్‌తో పెరిగిన ఉద్రిక్తతలు
- యుద్ధ సంకేతాలా?
- పాక్‌కు హెచ్చరికలు..

09

పాకిస్తాన్‌లో ముదురుతున్న ఆర్థిక, రాజకీయ సంక్షోభం వేళ.. సరిహద్దుల్లో భారత్ అడుగులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వరుస ఉన్నత స్థాయి సమీక్షలు, సరిహద్దు వెంబడి పెరిగిన మాక్ డ్రిల్స్, కొన్ని ప్రాంతాల్లో రేషన్ నిల్వ చేయాలని వస్తున్న ఆదేశాలు యుద్ధ సంకేతాలను ప్రతిబింబిస్తున్నాయి. భారత్ తన వ్యూహాలకు పదును పెడుతుండడంతో కేవలం ముందస్తు భద్రతా చర్యేనా లేక దాయాది దేశానికి గట్టి బుద్ధి చెప్పే దిశగా వేస్తున్న అడుగా అన్న ఉత్కంఠ నెలకొంది.

ముద్ర డెస్క్:

కేంద్ర మంత్రి బండి

## డంప్ యార్డు పాపం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లదే



- డంప్ యార్డు ఏర్పాటు స్థలం పరిశీలన
- జనావాసాల మధ్యలో ఏర్పాటు చేస్తే ఊరుకోం
- ఆందోళనకు బీజేపీ మద్దతు

03

## సమాజహితమే లక్ష్యం

- ఆదర్శ వివాహం చేసుకోవడం అభినందనీయం
- నూతన దంపతులకు మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సూచన





03

## పోలీస్ మామలు

02

## గ్రూపులోకి ఎస్ఐ

షాక్‌లో మందు బాబులు




- డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో దొరికిన ఫోన్
- గుట్టురట్టయిన 'పోలీస్ మామల స్క్వాడ్'.
- తనిఖీల సమాచారాన్ని షేర్ చేస్తున్న మందుబాబులకు ఎస్ఐ ఝలక్

## ఉంచారా? తొలగించారా?

### రేషన్ లబ్దిదారుల్లో ఐటీ భయం

- లక్షన్నర కార్డులపై సందిగ్ధం
- ఆదాయ పన్ను చెల్లిస్తున్నారా?
- అయితే మీ రేషన్ కార్డు రద్దయినట్లే




**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో అనర్హులైన రేషన్ కార్డుదారులపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించనుంది. ముఖ్యంగా ఆదాయ పన్ను చెల్లిస్తూ.. ఖరీదైన వాహనాలు, 15 ఎకరాల కంటే ఎక్కువ భూమి కలిగి ఉండి కూడా ఉచిత రేషన్ పొందుతున్న వారి కార్డులను తొలగించేందుకు సర్కార్ సిద్ధమైంది. ఆధార్, పాన్ కార్డుల అనుసంధానంతో లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులను పౌరసరఫరాల శాఖ పరిశీలిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 1.40 లక్షల కార్డులను తొలగించే ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా సంక్షేమ పథకాలు మిగతా 02లో

## హస్తం గూటిలో అసంతృప్తి సెగలు

### మంత్రి పదవుల వేట.. సీనియర్ల తిరుగుబాటు బాట

- తెలంగాణ కాంగ్రెస్‌లో ముదురుతున్న 'లొల్లి'!
- విస్తరణా.. మార్పులా...?
- మళ్లీ తెరపైకి కేబినెట్ క్యాంపు
- ఇప్పటికే సీనియర్లలో పెరిగిన అసంతృప్తి
- ఢిల్లీకి పెరుగుతున్న ఫిర్యాదులు
- అప్పుడప్పుడు మాటల యుద్ధం చేస్తున్న రాజగోపాల్ రెడ్డి
- స్వపక్షంలోనే చిచ్చు పెడుతున్న అనిరుధ్
- జగ్గారెడ్డి మౌనం వెనక వ్యూహమేంటి?
- ఈసారి మంత్రి వర్గ విస్తరణ కష్టాలకు కారణమవుతున్నట్టా?
- తెరపైకి ఒక బీసీ.. ఇంకో ఎస్టీ..?
- సీనియర్ల సహనానికి రేవంత్ పరీక్ష

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** అంతా సవ్యమే.. అంటూ చెప్తున్నా.. అధికార పార్టీలో అంతర్గత చిచ్చు రగులుతోంది. ఇప్పటికే అడపాదడపా కొంతమంది నేతలు సెటైర్లు, విమర్శలు చేసుకుంటూనే ఉన్నారు. ఓ వైపు జీవన్ రెడ్డి పార్టీని వీడితే.. ఏండ్ల నుంచి వ్యతిరేకస్వరంతో ఉన్న జగ్గారెడ్డి మౌనం కొంత ప్రమాదకరమే అని పార్టీలో టాక్. దీనికితోడు మంత్రివర్గంలో మంత్రులు, సీఎంకు మధ్య గ్యాప్ కూడా కనిపిస్తూనే ఉంది. పాత నేతలంతా ఒక్కటిగా కనిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి మిగతా 02లో






## ఇప్పుడు బాసర..

### రూ.225 కోట్లతో ఆలయఅభివృద్ధికి ప్రణాళిక

- సీఎం రేవంత్ సమీక్షతో బాసర రూపురేఖలు మార్పుకు గ్రీన్ సిగ్నల్
- భక్తులకు అధునాతన సౌకర్యాలు.. క్యూ కాంప్లెక్స్‌లు, ఘాట్‌ల విస్తరణ
- పర్యావరణహిత క్షేత్రంగా ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రమే అనుమతి
- ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి, పవిత్రతకు పెద్దపీట
- గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలన్న లక్ష్యం
- ఈ నెల 6న సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన..
- బాసర-భద్రాచలం కారిడార్‌కు శ్రీకారం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో దేవాలయాలపై సీఎం ఫోకస్ పెంచుతున్నారు. దీనిలో భాగంగా బాసర ఆలయ రూపురేఖలు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమయింది. రూ.225 కోట్ల అంచనాలతో చేపట్టనున్న పనులపై రేవంత్ సమీక్ష నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతి ఆలయ రూపురేఖలను మార్చేందుకు అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్షించారు. సుమారు రూ. 225 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని, పనులన్నీ అత్యంత అద్భుతంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాలని సూచించారు.

**పర్యావరణహిత క్షేత్రంగా బాసర**


ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా బాసరను ఒక ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, పర్యావరణహిత క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి మిగతా 02లో

## ఆలయాల పరిసరాల్లో నిబంధనలు

జ్ఞాన సరస్వతి అభివృద్ధిపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

సంప్రదాయాలకు అనుగుణంగా బాసర అభివృద్ధి

02



## గులాబీ తోటలోకి జీవన్ రెడ్డి

42 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి స్వస్తి

- సంజయ్ ఎఫెక్ట్.. కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌వైపు అడుగులు
- జగిత్యాల రాజకీయాల్లో భారీ మార్పు..
- బీఆర్ఎస్‌కు బలం, కాంగ్రెస్‌కు షాక్
- కేసీఆర్ హామీతో కీలక నిర్ణయం..
- జీవన్‌రెడ్డికి పెద్ద బాధ్యతలు?
- ప్లీనరీ వేదికగా శక్తి ప్రదర్శన..
- జీవన్‌రెడ్డి చేరికతో కొత్త సమీకరణాలు
- తిట్టిన పార్టీతోనే పొగిడించుకోనున్న మాజీ మంత్రి!

10

-ముద్ర, కరీంనగర్

## బీఆర్ఎస్ ఖాతాలో రెండు పురాలు

### పూర్తయిన ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి చైర్మన్ ఎన్నిక

- క్యాతనపల్లి వైస్ చైర్మన్ గా సీపీఐ కౌన్సిలర్
- పోలీసు పహారాలో జరిగిన ఎన్నికలు
- ఉదయం నుంచి కొనసాగిన హైడ్రామా

09

రెండు నెలలుగా తీవ్ర ఉత్కంఠ రేపిన ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ముగిసింది. హైడ్రామా, భారీ పోలీస్ బందోబస్తు మధ్య జరిగిన ఈ పోరులో బీఆర్ఎస్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వ్యూహాత్మక అడుగులతో ఇటు ఇబ్రహీంపట్నంలో బీజేపీ మద్దతుతో, అటు క్యాతనపల్లిలో సీపీఐతో జతకట్టి రెండు పీఠాలను తన ఖాతాలో వేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ 20 మున్సిపాలిటీలను గెలుచుకుంది.

ముద్ర, తెలంగాణ బ్యూరో







## డౌన్.. డౌన్ అమెరికా!

### ఇరాన్ భూభాగంలో కూలిన 3 యుద్ధ విమానాలు..

- ఇరాన్ ఉచ్చులో అమెరికా పైలట్
- పట్టుకుంటే భారీ నజరానా ప్రకటించిన ఇరాన్..
- రక్షణ కోసం అగ్రరాజ్యం పాట్లు!

02



## ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్
- ఆసిఫాబాద్ కలెక్టర్‌కు నోటీసులు


03



## అమరావతి ఐకానిక్ ముద్ర కనిపించాలి

- నిర్మాణ సంస్థలు కడుతోంది రాజధాని
- అమరావతి రాజధాని పనులపై సమీక్షలో


10



### ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్ర స్థాయిలో అమలు చేసి చూపించాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవడంతోపాటు నాణ్యతతో నిర్మాణాలు ఉండాలని ఆయన తేల్చిచెప్పారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

## ఇదీ ఏఐ ముద్ర




హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని చింతలకుంట వద్ద రేడియో టవర్ ఎక్కి ఓ వ్యక్తి ప్రేమించిన అమ్మాయి పెళ్లికి అంగీకరించలేదని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. యువకుడితో పోలీసులు ఫోన్‌లో మాట్లాడి కిందకు దించే ప్రయత్నం చేశారు.

### ఏసీ ఉష్ణోగ్రత 24–26°Cలో ఉంచండి



చాలా తక్కువ టెంపరేచర్ పెడితే కరెంట్ ఎక్కువ ఖర్చవుతుంది. సరైన టెంపరేచర్‌లో ఉంచితే చల్లదనం కూడా, సేవింగ్ కూడా ఉంటుంది.

# హస్తం గూటిలో అసంతృప్తి సెగలు

(మొదటి పేజీ తరువాయి)
(మొదటి పేజీ తరువాయి)

సమయంలో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయనుందని కొత్త టాక్. దీనిలో భాగంగానే మంత్రిమండలిని విస్తరించనున్నారని తెలుస్తోంది. అందుకే మంత్రిపదవి ఆశిస్తున్న నేతలంతా తమ స్వరాలను సవరించుకుంటున్నారు. మంత్రివర్గ రేసులోనే ఇతర కీలకమైన పదవుల జాబితాలో పేరు ఉండేలా అధిష్ఠానం దృష్టిలో పడేందుకు తెగ ఆయాస పడుతున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ నుంచి విజయశాంతి, సంజయ్, ప్రేమ్‌సాగర్‌రావు, అనిరుద్ రెడ్డి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది ఈ తిరుగుబాటు లిస్ట్‌లో చేరుతున్నారు. ఇప్పటికే రేవంత్ రెడ్డిపై కోపంతో జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. అదే బాటలో మరికొందరు ఉన్నారని ఆయన చెబుతున్నారు. మొత్తాన్ని మంత్రిపదవుల ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఇలాంటి ప్రయత్నాలు జరగడం కాంగ్రెస్‌లో సర్వసాధారణమైపోయింది.

**నిప్పు పెట్టిన రాజగోపాల్ రెడ్డి – కాంగ్రెస్‌లో అసంతృప్తి మంటలు**

తెలంగాణ కాంగ్రెస్‌లో అసంతృప్తి మళ్లీ ఎగసిపడుతోంది. ముఖ్యంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు ఈ అంతర్గత విభేదాలకు మరింత వేడి తెచ్చాయి. నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించిన ఆయన, తాను బీజేపీ నుంచి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి ఇవ్వకపోవడమే కాకుండా, తన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కూడా కేటాయించడం లేదని ఆరోపించారు. పరిస్థితి ఇలానే కొనసాగితే సీఎం కుర్చీనే కదిలిస్తానని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటివరకు ఒంటరిగా వినిపించిన ఈ అసంతృప్తి స్వరం, ఇప్పుడు మరికొందరు నేతల నుంచి కూడా వినిపించడం గమనార్హం. దీని వల్ల కాంగ్రెస్‌లో అంతర్గత ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది.

**కేబినెట్‌లో భారీ మార్పుల సంకేతాలు**

ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో సీఎం సహా 16 మంది మంత్రులు ఉన్నారు. మొత్తం 18 మందికి అవకాశం ఉండగా, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అయితే ఈ ఖాళీలను భర్తీ చేసే సాధారణ విస్తరణ కాకుండా, పూర్తి స్థాయి పునర్ వ్యవస్థీకరణకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పనితీరు సరిగా లేని ముగ్గురు మంత్రులను తప్పించే అంశంపై హైకమాండ్‌తో చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఖాళీగా ఉన్న రెండు స్థానాలతో పాటు తొలగించే ముగ్గురు మంత్రుల స్థానాలను కలిపి మొత్తం ఐదుగురికి అవకాశం దక్కేలా ప్రణాళిక సిద్ధమవుతోంది. దీని ద్వారా ప్రాంతీయ సమీకరణలు, సామాజిక సమతుల్యత, పార్టీ హామీలను సమన్వయం చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.

**ఎవరికి ఛాన్స్..? జిల్లాల సమీకరణలే కీ**


ప్రస్తుతం కేబినెట్‌లో రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం లేకపోవడం ప్రధాన అంశంగా మారింది. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, మహేష్ కుమార్ గౌడ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇవ్వవచ్చన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అలాగే బీసీ, ఎస్టీ వర్గాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ కొత్త ముఖాలను తీసుకురావాలని పార్టీ భావిస్తోంది.


**సీనియర్ల అసంతృప్తి – పెరుగుతున్న ఒత్తిడి**

పార్టీలో సీనియర్ నేతల అసంతృప్తి కూడా పెద్ద సవాలుగా మారుతోంది. విజయశాంతి ఇటీవల ఉద్యమకారుల సమస్యలను ప్రస్తావిస్తూ పార్టీపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రేమ్ సాగర్ రావు కూడా సీనియర్లను పట్టించుకోవడం లేదని విమర్శించారు. డీ సంజయ్ అయితే గౌరవం లేకపోతే పార్టీని వీడుతానని స్పష్టం చేశారు. అనిరుద్ రెడ్డి తరచూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ అసంతృప్తిని బయటపెడుతున్నారు. మరోవైపు జగ్గారెడ్డి ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్నప్పటికీ, ఆయన తదుపరి అడుగు ఏమిటన్నది ఆసక్తిగా మారింది. ఇప్పటికే జీవన్ రెడ్డి పార్టీని వీడడం కూడా కాంగ్రెస్‌లో పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది.

**ముందున్నది కీలక నిర్ణయం**

మొత్తం మీద కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ ముందు కాంగ్రెస్‌లో ఒత్తిడి రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి. మంత్రి పదవుల కోసం పోటీ, ప్రాంతీయ సమీకరణలు, సామాజిక సమతుల్యత అన్ని కలిపి అధిష్టానానికి ఇది పెద్ద పరీక్షగా మారింది. ఎవరికి పదవులు దక్కుతాయి.. ఎవరికి నిరాశ ఎదురవుతుంది అన్నది త్వరలో తేలనుంది.




# ఇప్పుడు బాసర..

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆలయ పరిసరాల్లో కేవలం ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు, అధునాతన క్యూ కాంప్లెక్స్‌లు, ఘాట్‌ల విస్తరణ వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఆలయ పవిత్రతను కాపాడే విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, నిబంధనలను కఠినతరం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

**గోదావరి పుష్కరాల వరకు పనులు పూర్తి**

ఆధ్యాత్మిక క్షేత్రాల్లో రాజకీయాలకు తావులేకుండా తిరుమల తరహాలో కఠిన నిబంధనలు అమలు చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాసర ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, భక్తులకు పూర్తి ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

**పనులకు సీఎం శంకుస్థాపన**

6వ తేదీ సీఎం రేవంత్ రెడ్డి బాసరలో పర్యటించి, ఈ భారీ అభివృద్ధి పనులకు అధికారికంగా శంకుస్థాపన చేయనున్నారు. రూ. 225 కోట్లతో ప్రారంభమయ్యే ఈ పనుల ద్వారా ఆలయ గర్భాలయం, రాజగోపురాలు, మడ వీధులు మరియు భక్తుల వసతి సౌకర్యాలను అత్యాధునికంగా అభివృద్ధి చేయనున్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయ కారిడార్‌ను పర్యాటక హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.



# ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహా నిబంధనలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహాలో నిబంధనలు అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాజకీయ పార్టీల సభలు, జెండాలు, ప్రదర్శనలు లేకుండా ఆధ్యాత్మికతకు పెద్దపీట వేయాలని సూచించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి పనులపై అయన శనివారం సమీక్ష నిర్వహించారు. తొలుత బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ. 225 కోట్ల వ్యయమవుతుందని అధికారులు తెలిపారు. మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించిన సీఎం పలు మార్పులు సూచించారు. సంప్రదాయాలు, శాస్త్రాలను పరిగణనలోకి తీసుకొని భక్తుల విశ్వాసాలకు పెద్దపీట వేస్తూ బాసర ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాలమైన రోడ్లు నిర్మించాలని సీఎం ఆదేశించారు. ఆలయ ప్రాంగణం భవిష్యత్‌లో భారీ వృక్షాలతో అలరారేలా అవసరమైన మొక్కలు నాటాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆలయం సమీపంలో హెల్త్ సెంటర్ నిర్మించాలని.. పుష్కరాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో అక్కడ తగిన సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండి భక్తులకు సేవలు అందించేందుకు అనువుగా దానిని నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎంతటి ప్రముఖుల వాహనాలైనా ఆలయ ప్రాంగణానికి బయటే నిలిచిపోవాలని.. ఆలయ ప్రాంగణంలోకి కేవలం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ద్వారానే చేరుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధి పనుల సమయంలో ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం కలగకుండా జాగ్రత్త పడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడితే ఏమాత్రం సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

# ఉంచారా? తొలగించారా?

(మొదటి పేపజీ తరువాయి)

పొందుతున్న వారికి నోటీసులు జారీ చేసి, లబ్ధిదారుల జాబితాను ప్రక్షాళన చేయాలని కేంద్రం రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది.

**జాబితా రెడీ**

తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు అలర్ట్. అనర్హుల కార్డులను త్వరలోనే తొలగించనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం చాలా మంది అర్హత లేకున్నా కార్డులు పొందినట్లు తేలింది. కోటీశ్వరులు సైతం రేషన్ కార్డులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వాటిని తొలగించేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా ఆదాయ పన్ను చెల్లించేవారి కార్డులను తొలగించేందుకు కేంద్రం రెడీ అయింది. ప్రస్తుతం రేషన్ తీసుకుంటున్న ఆయా లబ్ధిదారుల ఆధార్, పాన్కార్డు వివరాలను ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా సేకరించి వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించి కార్డులను తొలగించనున్నారు. దాంతో పాటు ఖరీదైన వెహికల్స్ కలిగివున్న వారి రేషన్ కార్డులు కూడా తీసివేయనున్నారు.

ఇప్పటికే తెలంగాణలో 83,545 మంది మరణించిన వారికి రేషన్ పంపిణీ జరుగుతున్నట్లు గుర్తించారు. పీఎం కిసాన్డేటా ఆధారంగా 52,339 మంది ఆదాయ పన్ను చెల్లిస్తున్నట్టు తెలిసింది. దాంతో పాటుగా 5,866 మందికి 15 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉండగా.. రైతు భరోసా ద్వారా ఏటా వీరికి 1.50 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరుకోగా అందులో ఆహార భద్రత కార్డుల కింద కేంద్రం 99.36 లక్షల కార్డులు మంజూరు చేసింది. ఈ కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రతి ఏడాది లక్షలకు లక్షలు ఐటీ చెల్లిస్తూ తాము పేదలమని చాలామంది నెలవారీగా ఉచిత బియ్యం తీసుకుంటున్నారు. దీనిపై గత రెండేళ్లుగా ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డు పొందేందుకు ఏడాదికి పట్టణాల్లో రూ.2 లక్షల ఆదాయం, గ్రామాల్లో రూ.1.50 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉండాలనే నిబంధన ఉంది. కానీ అందుకు విరుద్ధంగా నెలకు లక్ష ఆదాయం వచ్చే కుటుంబాలు కూడా నిరుపేదల కింద రేషన్కార్డులు తీసుకుంటున్నారు. పేదలకు పంచాల్సిన బియ్యాన్ని వీరు కొట్టేస్తున్నారు. అలా బియ్యం తీసుకోవటమే కాకుండా వాటిని తినకుండా బ్లాక్మార్కెట్‌లో అమ్ముకుంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వంకఠిన నిబంధనలు తీసుకొచ్చినా కొందరు అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. పేద కుటుంబాల ముసుగులో నిజమైన లబ్ధిదారులకు అందాల్సిన బియ్యాన్ని కాజేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దాంతో పాటుగా ప్రభుత్వ పథకాలు, విదేశీ విద్య వంటి వాటికి రేషన్ కార్డు ప్రామాణికంగా ఉండటంతో వాటిని కూడా కొట్టేస్తున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో అనర్హులకు రేషన్ కట్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**త్వరలో నోటీసులు..?**

తెలంగాణలో 1.40 లక్షల రేషన్ ర్డులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు ప్రకటించారు. కేంద్రం గుర్తించిన జాబితాను ఇప్పటికే తెలంగాణ పౌరసరఫరాల శాఖకు కూడా చేరినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా కార్డులు పొందిన వారికి నోటీసులు జారీ చేసి కార్డులు తొలగించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.






# డౌన్.. డౌన్ అమెరికా!

**ముద్ర డెస్క్ :**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరో సారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇరాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లిన అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాలు, ఒక హెలికాప్టర్‌ను ఇరాన్ సైన్యం కూల్చివేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఒకే రోజు ఈ ఘటనలు చోటుచేసుకోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకు దారి తీసింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. అయితే మరొక పైలెట్ గల్లంతైనట్లు తెలుస్తోంది. గల్లంతైన పైలెట్‌ను గుర్తించి సమాచారం అందించే వారికి భారీ నగదు బహుమతి ప్రకటించినట్లు ఇరాన్ ప్రకటించడం మరింత చర్చనీయాంశమైంది. దీంతో ఆ పైలెట్ కోసం ఇరాన్ భూభాగంలో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఇక మరోవైపు, తమ పైలెట్‌ను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అమెరికా అత్యవసర చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. ప్రత్యేక రెస్క్యూ బృందాలను రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది. అవసరమైతే మరింత సైనిక చర్యలకు కూడా సిద్ధంగా ఉన్నట్లు అమెరికా సంకేతాలు ఇస్తోంది. ఇటీవలి కాలంలో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌పై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఈ కూల్చివేతలు కీలక మలుపుగా భావిస్తున్నారు. తమపై ఎన్ని దాడులు జరిగినా సైనిక శక్తి ఏమాత్రం తగ్గలేదని, తమ గగనతల రక్షణ వ్యవస్థ బలంగా ఉందని ఈ ఘటనల ద్వారా ఇరాన్ ప్రపంచానికి సందేశం ఇచ్చినట్లైంది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు యుద్ధ స్థాయికి చేరుకునే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ సమాజం ఈ పరిస్థితిని సమీక్షిస్తూ, శాంతి చర్చల కోసం పిలుపునిస్తోంది.

# పోలీస్ మామలు గ్రూప్‌లో ఎస్ఐ ఎంట్రీ

**ముద్ర, కరీంనగర్ :**

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని ఆపిన పోలీసులు, అతని ఫోన్ పరిశీలించగా 'పోలీస్ మామల స్క్వాడ్' అనే వాట్సాప్ గ్రూప్ బయటపడింది. ఈ గ్రూప్ ద్వారా మందుబాబులు పోలీస్ తనిఖీల సమాచారాన్ని పంచుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన ఎస్ఐ చాకచక్యంగా ఆ గ్రూప్‌లో చేరి సభ్యులకు షాక్ ఇచ్చారు. "మీ అందరి నంబర్లు సేవ్ చేశాను.. త్వరలో కౌన్సెలింగ్ ఉంటుంది" అంటూ వీడియో సందేశం పంపించారు. ఈ ట్విస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.పోలీసుల ఈ చర్యపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. మద్యం తాగి వాహనం నడపడం ప్రమాదకరమని, చట్టాన్ని మోసం చేయాలనుకునేవారు తప్పించుకోలేరని మరోసారి రుజువైంది.

## పాకిస్తాన్ కు యూఏఈ అల్టిమేటం

### $3.5 బిలియన్ అప్పు వెంటనే చెల్లించాలి

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇప్పటికే ఆర్థికంగా కుదేలైన పాకిస్థాన్‌పై మరింత ఒత్తిడిని తీసుకువస్తున్నాయి. ఈ నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాక్‌కు భారీ షాక్ ఇచ్చింది. గతంలో అందించిన సుమారు $3.5 బిలియన్ (భారత కరెన్సీలో సుమారు ₹32 వేల కోట్లు) అప్పును వెంటనే తిరిగి చెల్లించాలని యూఏఈ ప్రభుత్వం కఠినమైన అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. ఈ అప్పులో 1996–97 సంవత్సరాల్లో తీసుకున్న సుమారు $450 మిలియన్ కూడా ఉండటం విశేషం. దాదాపు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ బకాయిలను ఇప్పుడు ఒకేసారి క్లియర్ చేయాలని యూఏఈ పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ఈ నిర్ణయం ఆ దేశానికి మరింత భారంగా మారింది.

ఇప్పటికే విదేశీ మారక నిల్వలు తగ్గిపోవడం, ద్రవ్యోల్బణం పెరగడం, అంతర్జాతీయ అప్పుల ఒత్తిడి పెరగడం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పాకిస్థాన్‌కు ఈ అల్టిమేటం పెద్ద సవాల్‌గా మారింది. ముఖ్యంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్ )తో కొనసాగుతున్న చర్చల మధ్యలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ఆర్థిక అనిశ్చితిని మరింత పెంచింది.

ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం అత్యవసర చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. సెంట్రల్ బ్యాంక్‌లో ఉన్న విదేశీ మారక నిల్వలను వినియోగిస్తూ ఈ మొత్తాన్ని మూడు విడతలుగా చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మొదటి విడతను త్వరలోనే చెల్లించి.. మిగిలిన మొత్తాన్ని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అయితే ఇది సాధ్యమవుతుందా అన్నది అనుమానంగానే ఉంది. ఎందుకంటే ఇప్పటికే దేశంలో విదేశీ మారక నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. ఇంధన దిగుమతులు, ఆహార సరఫరా వంటి కీలక అవసరాల కోసం కూడా డాలర్ల కొరత నెలకొన్న పరిస్థితి ఉంది.

ఆర్థిక నిపుణులు ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఒకవైపు అప్పులు, మరోవైపు అంతర్గత ఆర్థిక అస్థిరత, పైగా విదేశీ ఒత్తిళ్లు కలిసి పాకిస్థాన్‌ను మరింత సంక్షోభంలోకి నెట్టే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.

మొత్తంగా యూఏఈ ఇచ్చిన ఈ అల్టిమేటం పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితిని మరో కీలక మలుపులోకి తీసుకెళ్లింది. రాబోయే రోజుల్లో పాక్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఆ దేశ ఆర్థిక భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కరెంట్ బిల్లు : ఫ్యాన్ + ఏసీ కలిపి వాడండి**

ఫ్యాన్ గాలి సర్క్యులేషన్ పెంచి గది త్వరగా చల్లబడు-తుంది. దీంతో ఏసీ మీద లోడ్ తగ్గి బిల్లు తగ్గుతుంది.



## టెండర్ల రద్దుకై పోరాటానికి సిద్ధం

- ఏక రూప వస్త్రాలను కొనుగోలు చేయాలి
- చేనేత కార్మికులకు వనం శాంతి కుమార్ పిలుపు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

202627 విద్యా సంవత్సరంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారు చేసేందుకు టెస్కోకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.105.54 కోట్ల ఆర్డర్ ను రద్దు చేసి తిరిగి ప్రైవేటు సంస్థల దగ్గర కొనుగోలు చేయాలనుకోవడం బాధాకరమని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా శాఖ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల ఉపాధి లేకుండా చేయడమేనని అన్నారు. 393 చేనేత పారిశ్రామిక సహకార సంఘాలలో పని చేస్తున్న వేలాది చేనేత కార్మికుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యకంతం చేశారు. ప్రభుత్వం తమ బాధ్యత మర్చిపోతే ఉద్యమాలు పోరాటం ద్వారా గుర్తు చేయాల్సిన బాధ్యత చేనేత కార్మికులు, చేనేత పరిశ్రమ శ్రేయోభిలాషుల మీద ఉన్నదని అన్నారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం పిలుపుతో 2025 నవంబర్ 20న కమిషనర్ కార్యాలయం ముందు వేలాది మంది చేసిన ధర్నాతో వేలాది మంది చేనేత కార్మికులకు రుణ మాఫీ జరిగిందని గుర్తు చేశారు. 2026 మార్చి 25 న ఇందిరా పార్కు హైదరాబాద్ వద్ద జరిగిన ధర్నాతో రాష్ట్రంలో నిన్న జరిగిన గ్రామ సభలలో వేలాది మంది చేనేత కార్మికులకు నేతన్న భరోసా పథకం అమలు అయిందని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ టెస్కో నుండి కొనుగోలు చేయకుండా అడ్డదారిన ప్రవేశ పెట్టిన టెండర్ల విధానానికి వ్యతిరేకంగా భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలని చేనేత కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్కాల చంద్ర శేఖర్ పాల్గొన్నారు.



## దివ్యాంగులకు సహకరించాలి

- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

**ముద్ర, కరీనగర్:**

మానసికంగా, శారీరకంగా వైకల్యం కలిగిన విద్యార్థులకు సేవ చేస్తే మనిషికి గొప్ప ఆత్మ సంతృప్తి కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర మీడియా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీ మహాత్మా నగర్ లో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేధో దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల 36వ వార్షికోత్సవంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, ట్రస్టు సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కెవి నర్సింగరావు ఆధ్వర్యంలో ఈ పాఠశాల ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధులకు కృతజ్ఞతలు తెలిపారు. చాడ వెంకటరెడ్డి తో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందని, ఈ పాఠశాలను తనకున్న పరిచయాలతో మరింత అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షల కేటాయించిందని, తనవంతుగా పాఠశాలకు అన్ని విధాలుగా సహకారం అందిస్తానని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 1990లో ఈ పాఠశాల ప్రారంభమైతే తాను 1996లో ట్రస్ట్ సభ్యుడిగా జాయిన్ అయినట్లు వివరించారు. ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి రెండు ఎకరాల భూమి కేటాయించినట్లు గుర్తు చేశారు. దాతలు, సహకారంతో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ ఐఏఎస్ చొరవ శ్రీనిధి సహకారంతో రూ.26 లక్షల బస్సును కేటాయించినట్లు వివరించారు. నాప్కో సీఈఓ రాజు పాఠశాల అభివృద్ధికి ఏటా సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఎల్ వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడి పాఠశాలలో 18 ఏళ్లు దాటిన విద్యార్థుల నైపుణ్యాలు వెలికి తీసేందుకు కొవ్వొత్తులు, విస్తరాకులు, సరుపు తయారీ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ పాఠశాల లో ప్రస్తుతం 127 మంది ఉన్నారని తెలిపారు. 77 మంది వసతిగృహంలో ఉండగా 50 మంది డేస్కాలర్ విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ ఇలాంటి పాఠశాలల ను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ.. ఇక్కడి పాఠశాలలోని విద్యార్థులను తమ కాళ్లపై తాము నిలబడేలా తీర్చిదిద్దుతున్నందుకు సిబ్బందిని అభినందించారు. సీనియర్ జర్నలిస్ట్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ట్రస్టీ బి. వెంకటయ్య మాట్లాడుతూ ఈ పాఠశాలను 15 మంది విద్యార్థులతో కిరాయి ఇంట్లో ప్రారంభించినట్లు వివరించారు. ఈ పాఠశాలకు ప్రతి సంవత్సరం తనవంతుగా 20,000 అందిస్తానని చీఫ్ ఇంజనీర్ సుమతి దేవి ప్రకటించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సతీష్, ఐజేయు సెంట్రల్ ఈసీ మెంబర్ శేఖర్, ట్రస్టు సభ్యులు సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- ఆసిఫాబాద్ కలెక్టర్ కు నోటీసులు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట మండలం ఎల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా శనివారం డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. పాఠశాలలో నిల్వ ఉంచిన ఆహారం తిని ఆరుగురు విద్యార్థులతో పాటు ఒక ఉపాధ్యాయుడు అస్వస్థతకు గురై కాగజ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. దీనిపై ప్రాథమికంగా స్పందించిన కమిషన్.. ఇది ముమ్మాటికీ నిర్లక్ష్యమేనని, ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కు, ఆరోగ్యానికి భంగం కలిగించడమేనని స్పష్టం చేసింది. దీనిపై తక్షణమే స్పందించి, ఏప్రిల్ 27 లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది.

# సమాజ హితమే లక్ష్యం

- ఆదర్శ వివాహం చేసుకోవడం అభినందనీయం
- మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి




**ముద్ర, కరీంనగర్:**

సమాజ హితమే లక్ష్యంగా పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి,సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి నూతన దంపతులకు సూచించారు. జీవితంలో ఒకరినొకరు అర్థం చేసుకొని కలిసి జీవించడానికి నిర్ణయించుకొని ఆదర్శ వివాహం చేసుకోవడం అభినందించ దగ్గ విషయమని అన్నారు. శనివారం కరీంనగర్ నగరంలోని పద్మ నగర్ ఇందిరా గార్డెన్ లో సీపీఐ కరీంనగర్ జిల్లా సహకారంతో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ వింగ్ కో కన్వీనర్ కండె విజేత, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతమ్ ఆదర్శ వివాహం శ్రీనివాస్ రెడ్డి, చాడ వెంకటరెడ్డి ల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డి, వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మానవ సమాజంలో మగవారికి ఆడ వారి తోడు, ఆడ వారికి మగవారి తోడు ఎంతో అవసరమని, కష్ట, సుఖాల్లో పాలుపంచుకోడానికి ఒకరికి ఒకరు అండగా ఉండడం కోసం వివాహ బంధంతో ఒకటి కావడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, ప్రపంచంలో వివిధ మతాలు, సాంప్రదాయాలకు అనుగుణంగా వివాహాలు జరగడం పరిపాటి కానీ వివాహానికి ముందే అన్ని విధాలుగా ఒకరినొకరు పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని జీవితంలో ముందుకు సాగడానికి ని ర్ణయించుకున్న తర్వాతే నేటి సమాజంలో వివాహాలు చేసుకుంటున్నారని ఇది శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాంద్ర సదానందం, మంద సుదర్శన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్
మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొయ్యడ సృజన్ కుమార్, రామగుండం కార్పొరేటర్ మార్కాపురి సూర్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ తో పాటు సిపిఐ మరియు ఏఐఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు పాపం వారిదే..

- బీఆర్ఎస్ ప్రతిపాదిస్తే కాంగ్రెస్ ఏర్పాటు చేస్తోంది
- హుజూరాబాద్ లో డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన బండి
- ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామికి పూజలు



**ముద్ర, కరీంనగర్ :**

హుజూరాబాద్ లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ వ్యతిరేకిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలం జనావాసాలకు దగ్గరగా ఉండటమే కాకుండా వన్యప్రాణులు కూడా ఉండటమే అందుకు కారణమని చెప్పారు. హుజూరాబాద్ ప్రజల ఆందోళనను అర్థం చేసుకుని చెత్త డంపింగ్ యార్డ్ స్థలాన్ని జనావాసాలు లేని ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హుజూరాబాద్ ప్రజలతో కలిసి బీజేపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. హుజూరాబాద్ సమీపంలో చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలనే పాపం కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు చేసిన తప్పిదమేనని మండిపడ్డారు. గత పాలకులు ఇక్కడే డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తే... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకువచ్చిందన్నారు. ఆనాడు డంపింగ్ యార్డును హుజూరాబాద్ సమీపంలోనే ఏర్పాటు చేయాలని చెప్పిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులే ఈరోజు అందుకు భిన్నంగా ఆందోళనలు చేయడం సిగ్గుచేటని అన్నారు. శనివారం హుజూరాబాద్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డితో పాటు స్థానిక బీజేపీ నేతలతో కలిసి సిర్సపల్లి, రంగాపూర్ సమీపంలోని డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. రోడ్డుకు ఆనుకున్న ఉన్న స్థలంలో హుజూరాబాద్ మున్సిపాలిటీ శివారు ప్రాంతమైన సిర్సపల్లి, రంగాపూర్ సమీపంలో చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తుండటంతో హుజూరాబాద్ ప్రజలకు తీవ్రమైన హానీ చేకూరే ప్రమాదముందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని పున: పరిశీలించాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

**సీతా రామచంద్ర స్వామికి పూజలు:**

ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతా రామ చంద్ర స్వామి రథోత్సవంలో పాల్గొన్న బండి సంజయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు సంజయ్ కు ఘన స్వాగతం పలికారు. ఉత్సవ నిర్వాహకులు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు.

## తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కేసుల పేరుతో ఇబ్బందులు పెడితే భయపడేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తేల్చి చెప్పారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని సవాల్ చేశారు. మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని అప్పుడు కేసులు తిరగబడతాయని హెచ్చరించారు. శనివారం సీఐడీ విచారణ అనంతరం అయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాగా ఈ ఏడాది జనవరి 29న హుజూరాబాద్‌లో సమ్మక్క జాతర సమయంలో గొడవ చోటు చేసుకుంది. పోలీసుల విధుల్లో అడ్డంకి, దూషణలు, మతవిద్వేష వ్యాఖ్యలు చేసినట్లు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు అయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో ఇటీవల విచారణకు రావాల్సిందిగా సీఐడీ అధికారులు కౌశిక్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు. దీంతో ఇవాళ కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన భార్య శాలినిరెడ్డి హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి వచ్చారు.

## గజ్వేల్ లో దాడి

- కేసీఆర్ క్యాంప్ ఆఫీస్ దగ్గర ఆందోళన
- సీఎం ఆదేశాలతోనే జరిగిందన్న హరీశ్ రావ్



**ముద్ర, గజ్వేల్:**

గజ్వేల్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. మాజీ సీఎం, ప్రస్తుత ప్రతిపక్ష నేత కేసీఆర్ క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో లేకపోవటంపై నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఫొటోతో క్యాంప్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. కార్యాలయం గోడకు రేవంత్ ఫొటోను తగిలించారు. ఈ క్రమంలోనే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు... క్యాంప్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఫర్నీచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనను బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే ఈ దాడి జరిగందని ఆరోపిస్తున్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే దాడి: హరీశ్ రావ్**

ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్ రావ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ముమ్మాటికీ ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని ఆరోపించారు. "పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోంది. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా..? కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధుల పై దాడులు, ప్రజా సంఘాలపై దాడులు, మీడియా పై దాడులు.. నిత్యకృత్యం కావడం సిగ్గు చేటు అని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదు..?" అని హరీశ్ రావ్ ప్రశ్నించారు. "ఒకవైపు "హేట్ స్పీచ్ బిల్" పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ... మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ... గూండా రాజ్యం అమలు చేస్తారా? సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ... పాలనను గాలికి వదిలేసారా? ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే... ఇక్కడ పాలనను ఎవరు చూస్తారు? బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా..?"అని హరీశ్ రావ్ నిలదీశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు.

## యాదాద్రిలో గిరి ప్రదక్షిణ

**ముద్ర,యాదగిరిగుట్ట :**



తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని శనివారం దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. తెల్లవారుజామున 5:30 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద స్వామివారి పాదాలకు ఈవో భవాని శంకర్ ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. భక్తులు స్వామివారి కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం భక్తులు కాలినడకన కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎస్పీఎఫ్ ఆర్ ఐ శేషగిరిరావు, ఎస్సై రవి సిబ్బంది నందు నాయక్ రమేష్ హోంగార్డు భాస్కర్ స్థానికులు భక్తులు పాల్గొన్నారు.

**స్వామి వారి సన్నిధిలో స్వాతి నక్షత్ర వేడుకలు**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని శనివారం ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి నిత్య పూజల అనంతరం అష్టోత్తర శతఘటభి షేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో 108 కలశాలను వరుస క్రమంలో పేర్చి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాల లో మంత్ర పూరితమైన జలంతో స్వామివారిని అభిషేకించారు. స్వామి వారి అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానఅర్చకులు సురేంద్ర చార్యులు ఉప ప్రధానార్చకులు లక్ష్మణ్ కుమార్ చార్యులు మంగళగిరి నరసింహమూర్తి వేణుగోపాలాచార్యులు కిరణ్ కుమార్ చార్యులు మురళీ కుమార్ చార్యులు భరత్ కుమార్ చార్యులు నరేష్ చార్యులు ప్రసన్న రాఘవాచార్యులు శ్రీనాథ్ చార్యులు భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 05.04.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## యుగపురుషుడు
## బాబూజీకి అక్షర నీరాజనం!!




నేల విడిచి సాము
చేయని ధీశాలి..
నిమ్న వర్గాల గుండెల్లో
నిలిచిన ఆత్మబంధువు!
భారతమ్మ నుదుట
దిద్దిన విజయ తిలకం
సమసమాజ స్వప్నాన్ని
నిజం చేసిన శ్రమజీవి
బాబూజీ!

శ్రామిక లోకపు ఆశాజ్యోతి
కార్మిక శాఖకు ప్రాణం పోసి..
చెమట చుక్కకు చట్టబద్ధమైన గౌరవం కల్పించిన దాత!
కనీస వేతనం.. గరిష్ట రక్షణ..
కార్మికుల హక్కుల కోటను నిర్మించిన మేరునగ ధీరుడు!

హరిత విప్లవ సారథి
ఆకలి కేకల భారతాన్ని చూసి చలించి..
కరువు రక్కసి కోరలు పీకేసిన అన్నదాతల ఆప్తమిత్రుడు!
హరిత విప్లవపు విత్తనాన్ని నాటి..
దేశాన్ని ధాన్యపు రాశుల గనిగా మార్చిన ఆధునిక
భగీరథుడు!

సమాచార వారధి
ఉత్తరాల లోకాన్ని ఉర్రూతలూగించి..
తపాలా వ్యవస్థను పల్లె గడపకు చేర్చిన దార్శనికుడు!
టెలిఫోన్ తీగల్లో మాటల మధురిమను నింపి..
దూరాలను కనుమరుగు చేసిన విప్లవ యోధుడు!

రవాణా మార్గాల సృష్టికర్త
రైలు పట్టాలపై ప్రగతి రథాన్ని నడిపి..
రవాణా శాఖలో నవశకాన్ని ఆవిష్కరించిన ఘనుడు!
అన్ని ప్రాంతాలను అనుసంధానిస్తూ..
అభివృద్ధి బాటలను సుగమం చేసిన కార్యదక్షుడు!

అజేయమైన రక్షణ సారథి
సరిహద్దుల్లో శత్రువుల సింహస్వప్నం..
1971 యుద్ధంలో భారతావనికి గర్వకారణం!
నాడు రక్షణ శాఖను నడిపిన తీరు..
నేటికీ భారత సైన్యానికి స్ఫూర్తి శిఖరం!

కులం కంచెలను దాటి..
అంటరానితనంపై యుద్ధం ప్రకటించి..
అరవై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో
ఒక్క మచ్చ లేని చంద్రుడిగా వెలిగిన మహనీయుడు!
సమతా మూర్తికి.. సమసమాజ నిర్మాతకు..
మీరు చూపిన బాట.. మాకు నిత్య చైతన్య పాట!
మా యొక్క అక్షరాల రాతలు మీకు ఘన నివాళులు..

- జటావత్ రాజు (యువ కవి, రచయిత)
తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్. 9347196264

# మీలో ఈ గుణం ఉందా..?

చాలామంది తరుచుగా ఒక మాట చెప్తారు. మా వద్ద ధనమే లేనప్పుడు దానం ఎలా చేయగలమ్ అని. కాని వారికి తెలియని వాస్తవం ఏమిటంటే "దానం" చేయడానికి ధనమే అవసరం లేదు. దానం చేయడానికి మీ వద్ద "విద్య" ఉండవచ్చు. మీరు తినే ఏదైనా ఆహారం కావొచ్చు, (అన్నదానం) అవయవ దానం, రక్తదానం, వస్త్ర దానం ఇలా ఏదైనా కావొచ్చు. కొన్ని ప్రాణంతో వున్నప్పుడు దానం చేసేవి. మరికొన్ని మనం ఈ లోకం నుండి శాశ్వతంగా వీడిపోయిన ప్పుడు మన శరీరంలోని అవయవాలు దానం చేయడం. అలాగే ఈ మధ్య కొందరు చనిపోయాక తమ పార్థివ దేహాన్ని ఏదైనా మెడికల్ కళాశాలకు లేదా హాస్పిటల్ కు పరిశోధనల నిమిత్తం దానం చేస్తామని బ్రతికుండగానే అంగీకార పత్రం వ్రాసి ఇస్తున్నారు. ఇప్పుడు చెప్పండి ఇలాంటివి దానం చేయడానికి డబ్బులు అవస రమా? ఒకసారి కుంభవర్షం కురుస్తున్న సమయాన ఓ బ్రాహ్మణుడు కర్ణుడి వద్దకు వచ్చి వంట చేసుకోవడానికి కట్టెలు మొత్తం (వంట చెరుకు) తడిసిపోయాయి అని అడిగాడట. మారు ఆలోచన చేయకుండా అప్పుడు కర్ణుడు తన ఇంటి వాసాలు (చెక్కతో కూడినవి) తీసి ఇచ్చాడట ఇక్కడ సమయానుసారంగా దానం చేశాడు కర్ణుడు. ఒకవేళ తన వద్ద వున్న నగలు, వజ్రాలు, దానం చేసినా ఆ బ్రాహ్మణుడు వాటిని తినలేడు కదా ఆ సమయంలో, అదే "దానం" సందర్భోచితమైనది.

కాబట్టి దానం చేయడానికి రంతిదేవుడు, బలిచక్రవర్తి హరిశ్చం ద్రుడు, దంతిదుర్గుడు, మొదలైన వారిలా మీరు గొప్ప గొప్ప దానాలు చేయాల్సిన అవసరం లేదు. అలాగే మీరు సర్వం దానం చేసి రోడ్డునపడాల్సిన అవసరం అంతకన్నా లేదు. మీరు మీ సమయం ఇతరులకు, కుటుంబ సభ్యులకు, సమాజానికి దానం చేయండి. అన్నింటికన్న గొప్ప దానం "సమయా దానం". మీ విలువైన సమయం ఇతరుల కోసం కేటాయిం చటం. మాట సహాయం, సందర్భ సహాయం, పనిసహాయం, పాత్రల సహాయం, పుస్తక సహాయం/ దానం ఇలా ఏదైనా కావొచ్చు, మీకు దానం చేయడానికి ఇలా చేస్తే అది మీ కీర్తిని ఇనుమ డింపజేస్తుంది. అలాగే దాన స్వభావానికి మరింత వెన్న దన్ను లభించేలా పరిస్థితులు "కాలం" కూడా సహకరిస్తుంది. మీ లాంటి వారి కోసమే ఓ మంచి కథను చదవండి. ఓ పేద స్త్రీ బస్సు ఎక్కింది సీటు దొరికింది. కాని ఆమె పక్కన ఓ గర్భవతి నిలబడి ఉండటం చూసింది. వెంటనే లేచి నిలబడి గర్భవతికి తన సీటు ఇచ్చి పక్కన నిల్చుంది. కొద్ది సేపయ్యాక గర్భిణి స్త్రీ దిగాల్సిన ఊరు రావటంతో దిగిపోయింది. అప్పటి వరకు నిల్చున్న తను కూర్చుంది. కొద్ది దూరం బస్సు ప్రయాణించాక ఓ "వృద్ధుడు" బస్సు ఎక్కాడు. సీటు ఖాళీగా లేకపోవటం వల్ల అతడు ఈమె సీటు వద్ద నిల్చున్నాడు. అది గమనించి మళ్ళీ లేచి ఆ వృద్ధుడికి తన సీటు ఇచ్చి కూర్చోమని చెప్పి తను నిలబ డింది. అతడి గమ్యస్థానం రాగానే ఆ వృద్ధుడు కూడా దిగిపోయాడు. తను మళ్ళీ సీట్లో కూర్చుంది. కాని వృద్ధుడు దిగగానే ఓ యువతి బస్సు ఎక్కుతుంది. కాని సీటు లేకపోవడం వల్ల నిలబడుతుంది. మళ్ళీ ఆ యువతికి సీటిచ్చి తను నిలబడుతుంది. కొద్దిసేపయ్యాక ఆ యువతి గమ్యస్థానం రాగానే దిగిపోతుంది. ఆ తరువాత పేద స్త్రీ గమ్యస్థానం వస్తుంది తను కూడా బస్సు దిగింది.

బస్సులో తను చేస్తున్న సహాయాన్ని వెనుక సీట్లో కూర్చున్న ఓ ప్రొఫెసర్ ఆమెను ఆసక్తిగా గమనించసాగాడు. తనతో పాటు దిగిన (పేద మహిళతో) ఆమెను అనుసరించి "అమ్మ" మీతో ఓ మాట అడ గాలనుకుంటున్నాను సమాధానం చెప్పగలరా? అని బస్సులో గర్భిణి స్త్రీ వచ్చినప్పుడు మీ సీటును "త్యాగం" చేశారంటే అర్థం వుంది. కాని ఆ తరువాత వచ్చిన "వృద్ధుడికి" కూడా త్యాగం చేశారు సరే "యువ తికి" మీరు మీ సీటును ఎందుకు త్యాగం చేశారు? అని ఆ మాటలు విన్న ఆవిడ నవ్వి చూడండి "నేను పేదరికంలో వున్న దానిని నా వద్ద దానం చేయడానికి డబ్బులు వుండవు. కాని నా సమయాన్ని సంద ర్భానుసారంగా దానం చేస్తాను" అంటుంది. ఆమె చెప్పిన సమాధానం విన్న ప్రొఫెసర్ వద్ద మౌనమే సమాధానమైంది. మళ్ళీ తనే (పేద స్త్రీ) జోక్యం చేసుకొని మౌనంగా వున్న ఆ ప్రొఫెసర్ వైపు చూస్తూ అయ్యా నేను సంపన్నుల ఇళ్ళలో బట్టలు ఉతికి వారి ఇంటి పరిసరాలు శుభ్రం చేస్తాను. ఫలితంగా వారు ఇచ్చే చిన్న మొత్తంలో నా కుటుంబాన్ని నెట్టుకొస్తాను. ఇక నాకు "దానం" చేయడానికి ఏముంది చెప్పండి? నా వద్ద. నేను చేసేది సరైనదే కదా? అని ఎదురు ప్రశ్నిస్తుంది. ఆ మాటలకు "ప్రొఫెసర్" రెండు "చేతులు జోడించి" నమస్కరించి ఈ రోజు నీ ద్వారా ఓ మంచి "పాఠం" నేర్చుకున్నాను. నువ్వు నాలో గొప్ప ప్రేరణ కల్గించావు. ఈరోజు క్లాసులో నీ గొప్ప "గుణం" గురించి వివరిస్తాను అని అక్కడి నుండి నిష్క్రమించాడు.

ఇప్పుడు చెప్పండి ఈ మొత్తం కథ ద్వారా మీరు ఏం నేర్చుకున్నారు.



తను పేదరికంలో ఉన్నప్పటికీ సమయానుసారంగా తన "కర్మలను" దానం చేసే గొప్ప విశాల హృదయం అలవర్చుకుంది. మనలో ఇలాంటి అలవాటు ఎంతమందికి ఉంటుంది చెప్పండి. ఇప్పుడున్న బిజీ కాలంలో మనం మన "సమయం" ఇతరుల కేటాయించటమే గగనమైపోయింది. తీరిక లేని జీవితం "డబ్బు" మీద విపరీతమైన "యావ" పెరగటం. ఇతరుల గురించి పట్టించుకోవడం అనవసరం అనే భ్రమలో బ్రతుకున్నామ్. కొంతమేర నిజమే కావొచ్చు. కాని మీ పక్కన వ్యక్తి ప్రమాదంలో వుంటే వదిలి వెళ్తారా చెప్పండి. మానవత్వం లేని మృగంలా ప్రవర్తిస్తే అడవిలోని క్రూర మృగాలకు మనకు తేడా ఏమిటి చెప్పండి. మనిషిలో మానవత్వం కరుమరుగై విగ్రహాల మాదిరిగా మిగిలిపోతున్నామ్. ఎదురుగా హింస, నేరం, ప్రమాదం జరిగినా పట్టించుకోకుండా యాంత్రికంగా వెళ్ళిపోతామ్. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యమైనది కాదు. ఇటీవలే సుప్రీం కోర్టు రహదారులపై ప్రమాదం జరిగితే కాపాడిన వారికి ఇరవై ఐదు వేలు పరిహారంగా ప్రకటించిన విషయం మరువకూడదు. ఇస్లామిక్ మూల సూత్రాలలో (ఐదు సూత్రాలు) జకాత్ / దానం గురించి వివిధ సంద ర్భాలలో ఖురాన్ లో వివరించబడింది. ఇది ఓ రకంగా పేద ధనిక మధ్య తారతమ్యాలను చెరిపివేసే గొప్ప ప్రయత్నం.

ప్రస్తుతం ఈ ప్రపంచంలో అన్నింటి కన్నా గొప్ప దానం "సమయా దానం" మీ విలువైన సమయం ఇతరుల కోసం కేటాయించి వారి జీవితాల్లో వెలుగు నింపితే అంతకంటే గొప్ప దానం ఏం వుంటుంది చెప్పండి. కురుక్షేత్ర యుద్ధంలో శ్రీ కృష్ణుడు తన సమయాన్ని పాండ వులతో గడిపి ఓ మంచి కార్యం పూర్తికావడానికి కారకుడవుతాడు. ఇంతకుమించిన "సమయా దానం" ఇంకేం ఉంటుంది చెప్పండి. అలాగే కష్టాల్లో వున్న శ్రీరాముడి చెంత ఆంజనేయుడు ఎంత విలువైన సమయం కేటాయించాడో ఓ సారి తర్కించి చూడండి మీకే అర్థమౌ తుంది. గాంధీ గారు తన విలువైన సమయాన్ని జీవితాన్ని దేశం కోసం ధారపోశారు కాదంటారా ? ఇలా చెప్పుకుంటూ పోతే నెహ్రూ, పటేల్, అంబేడ్కర్, కలాం, మండేలా, లింకన్ ఇలా ఒకరేమిటి చాలామంది వారి విలువైన జీవితాలను సమాజానికి ఫణంగా పెట్టి ప్రసిద్ధికెక్కారు. మీరు ఆ స్థాయిలో కాకపోయినా మీ "సమయం" ఇతరుల కోసం, మీ కుటుంబం కోసం, సమాజం కోసం దానం చేయండి.

ఇక్కడ మరో చిన్న విషయం ప్రస్తావించి ముగిస్తాను. ఓ వ్యాపారస్తుడు "యాభై కోట్ల ఆస్తి" సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. పైసా పైసా కూడబెట్టి యాభై కోట్లు సంపాదిస్తాడు. ఏ రోజు కూడా కుటుంబానికి, సమాజానికి, సమయం కేటాయించడు. ఓ రోజు ఉదయం నిద్ర లేవగానే ఇద్దరు యమభటులు ప్రత్యక్షమై నీ చావు ముహూర్తం ఆసన్నమైంది యమలోకం పిలుస్తుంది పోదాంపద అంటారు. భటుల మాటలు విన్న "కోటీశ్వరుడు" నేను ఈ మధ్యనే యాభై కోట్లు సంపాదించాను ఇక మీదట దానాలు, ధర్మాలు, కుటుంబానికి, సమాజానికి, అలాగే దైవ దర్శనాలు చేసుకోవాలని రాత్రే నిర్ణయించుకున్నాను. నాకు ఆరు నెలల సమయం ఇవ్వండి అని వేడుకుంటాడు. అతడి మాటలు విన్న యమభటులు ఆరు నెలలు కాదు కదా అరవై నిమిషాలు (గంట) కూడా సమయం లేదు యమ ధర్మరాజు వెంటనే మీ ప్రాణాలు తీసుకొని రమ్మన్నారు రండి అంటారు.


చేసేది ఏమీలేక ఇంట్లోకి వెళ్ళి తను సంపాదించిన యాభై కోట్ల డబ్బున్న సంచిని తెచ్చి ఇది తీసుకొని నన్ను వదిలి పెట్టండి అని వేడుకుంటాడు. ఆ డబ్బులను చూసిన యమభ టులు పెద్దగా నవ్వి మీ డబ్బులు మా లోకంలో (యమలోకం) చెల్లవు. వ్యర్థ ప్రేలాపనలు వద్దు వెంటనే రమ్మని హుంకరిస్తారు. వారి సైగలకు భయపడిన వ్యాపారి పది నిమిషాల సమయం మాత్రమే ఇవ్వండి అని ఇద్దరి కాళ్ళు పట్టుకొని వేడుకుంటాడు. సరేనంటారు యమభ టులు. వెంటనే ఇంట్లోకి వెళ్లి ఓ తెల్ల కాగితంపై "నేను నా జీవిత కాలాన్ని దుర్వినియోగం చేసుకున్నాను డబ్బు యావలో పిల్లలు, సమాజం, పరిసరాలు, నీతి మొదలైన విషయాలు పట్టించుకోలేదు. ఎంత సంపాదించినా ఎలా సంపాదించిన చివరికి ఏవి వెంట రావు. ఇంత "కాలం" నేను నా విలువైన సమయాన్ని దుర్వినియోగం చేశాను మీరు ఇలా చేయకండి" అంటూ ముగించి యమభటులతో కలిసి యమలోకానికి వెళ్ళిపోతాడు.

బహుశా మీకు ఈ పాటికే అర్థమై వుంటుంది సమయం ఎంత విలువై నదో జీవితంలో డబ్బే సర్వస్వం కాదని దాని కన్నా విలువైనవి ఈ ప్రపంచంలో చాలా ఉన్నాయని ఇప్పటికైనా గ్రహించండి. మీలో ఉండాల్సినవి ఏమిటి? వదులుకోవాల్సినవి ఏమిటో బేరీజు వేసుకొని మీ గుణాలను ఇంకాస్త మెరుగుపరచుకొండి.



- డా.మహ్మద్ హసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్ నెం.990805923.

# బాబూజీ శక్తి... సమానత్వపు సూక్తి




**బాబూ జగ్జీవన్ రాం... ఇండి యన్ దళిత ఐకాన్.. ఆయన ఇప్పటికే కాదు.. ఎప్పటికీ తెలియాల్సిన అవసరం ఉంది. ముందు ముందు తరాలకు కూడా జగ్జీవన్ రామ్ ఆశయాలను తీసుకెళ్లాల్సిందే. ఎందుకంటే ఆయన దళితుల శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేశారు. దేశంలోని దళితులకు చిహ్నంగా(బాబూజీ)గా మారారు. బాబూజీ ఒక సామాన్య కుటుంబంలో 1908 ఏప్రిల్ 5న జన్మించారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 5న ఆయన జయంతిని ఘనంగా దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నాం. బీహార్‌లోని భోజ్‌పూర్ జిల్లా చంద్వా అనే చిన్న పల్లెటూరులో జన్మించారు. ఆయనకు అన్నయ్య సంత్ లాల్, ముగ్గురు అక్కచెల్లెళ్లు. నాయకులకు, ప్రస్తుత తరానికి స్ఫూర్తినిచ్చే ఆదర్శ వ్యక్తిత్వం బాబూ జగ్జీవన్ రామ్ ది.**

### కలత చెందే అంశం- సాధనకు మార్గం

జగ్జీవన్ రామ్ చదువుకుంటున్న రోజుల్లో దళితులు, కాలి చెప్పులు తయారు చేసేవాళ్లకు కొన్ని ఆంక్షలు ఉండేవి. స్కూల్లో అగ్రకులాల పేరుతో హిందువులకు, ముస్లింలకు వేరువేరు మంచినీటి కుండ లుండేవి. ఒకరోజు దాహంతో ఉన్న జగ్జీవన్ రామ్ తెలియనితనంతో ఓ అగ్రకుల (హిందూ) కుండలోని మంచినీళ్లు తీసుకుని తాగాడు. ఇది చూసిన అగ్రకులాల విద్యార్థులు 'చర్మకారుడైన అయిన జగ్జీవన్ రాం ముట్టుకున్న కుండని మేము ముట్టుకోం అంటూ స్కూలు కుండలో మంచి నీటిని తాగడం మానేశారు. వీరి ప్రదర్శనకు ఇతరులు (అప్పటి ముస్లింలు) కూడా మద్దతుగా ఉండాల్సి వచ్చేది. దీనితో హెడ్మాస్టర్ అగ్రకుల విద్యార్థులకు, దళిత విద్యార్థులకు వేరు వేరు మంచినీటి కుండలు పెట్టించారు. ఇది చూసిన జగ్జీవన్ రామ్ హిందువులు, ముస్లింల కంటే తన దళితుల స్థాయి ఇంత హీనమైనదా అని తీవ్రంగా కలత చెంది ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్కూల్లో పెట్టిన రెండు కుండలను పెట్టినప్పుడల్లా జగ్జీవన్ రాం బద్దలు కొట్టేసేవాడు. హెడ్ మాస్టర్ కు తెలిసినప్పటికీ ఏం చేయలేని పరిస్థితి. చివరికి అభిమతాన్ని గుర్తించి ఒక్కటే నీళ్లకుండ పెట్టించారు. అలాగే బనారస్‌లో క్షవరం కోసం మంగలి షాప్‌కి వెళ్ళేవాడు. జగ్జీవన్ రాం చెప్పులు కుట్టే కులస్థుడని మంగళి వారు క్షవరం చేయడం మానేస్తే.. ఇది మానవత్వానికే తీరని అవమాన మని, ఇందుకు నిరసనగా ప్రజలు మంగళ షాపులను బహిష్కరిం చాలని జగ్జీవన్ రామ్ బస్తీలన్నీ తిరిగి జనాన్ని ఐక్యం చేశారు. దీంతో ప్రజలు బహిష్కరించడం మొదలుపెట్టారు. తమ వైఖరిని మార్చుకొని చెప్పులు కుట్టేవాళ్లకూ క్షవరం చేసేందుకు ఒప్పుకో వాల్సి వచ్చింది. వృత్తులకు, పుట్టిన జాతులకు సంబంధం ఉండదని నిరూపించగలిగారు. అలా జగ్జీవన్ రామ్ భవిష్యత్ పోరాటాలకు స్కూల్లోనే బలమైన పునాదులు పడ్డాయి. జగ్జీవన్ రామ్ ఆర్య సమాజం వారి హాస్టల్ లో ఉన్న రోజుల్లో ఆయన కులం తెలుసు కున్న హాస్టల్లోని వంటవారు అతని పాత్రలు కడగడం మానేసారు. ఇది చూసిన ఓ అధ్యాపకుడు తమ ఇంట్లోనే బాబూజీని పెట్టుకు న్నారు. కొన్నాళ్లు అక్కడ ఉన్న బాబూజీ కులం తెలుసుకున్న పనివాళ్లు అధ్యాపకుడి ఇంట్లో పని చేయడం మానేశారు. తర్వాత ఓ ఇంట్లో అద్దెకు దిగిన బాబూజీ యజమానికి డబ్బులు చెల్లించినా కూడా ఆయన కులం తెలిశాక మళ్లీ తిరిగిచ్చే ప్రయత్నం చేశారు. బాబూజీ మాత్రం డబ్బులు తీసుకోకుండా అద్దెంట్లోనే మకాం వేసి మొండిగా ఉన్నారు.ఇలా ఎన్నో అవమానాలు ఎదురౌతున్నా సమా నత్వంతోనే ముందుకెళ్లే ప్రయత్నం చేశారు జగ్జీవన్ రామ్...

### బాబూజీ విద్య, రాజకీయ జీవితం-మలుపులు

బాబూ జగ్జీవన్ రామ్ 1914లో ప్రాథమిక విద్య ప్రారంభించి, 1925లో అగర్వాల్ మిడిల్ స్కూల్ నుండి మెట్రిక్యులేషన్ పాసయ్యారు. కాలేజీ విద్య కోసం బెనారస్ విశ్వవిద్యాలయంలో చేరి, చదువు మధ్యలో వదిలివేయవలసి వచ్చింది. బాబూజీ ఉన్నత విద్య పట్ల శ్రద్ధతో.. కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజీలో చేరాడు. 1927లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి B.sc డిగ్రీ పట్టా పుచ్చు కున్నారు. అప్పట్లో బాబూజీకి బాల్యవివాహమే జరిగింది. భార్య కొద్ది కాలానికే చనిపోవడంతో తిరిగి 1935లో డాక్టర్ బీర్బల్ కుమార్తె ఇంద్రాణి దేవితో పెళ్లి జరిగింది. వీరికి సురేష్ కుమార్, మీరా(లోక్ సభ స్పీకర్) అను ఇద్దరు సంతానం కలిగారు. 1935లో కాన్పూర్‌లో జరిగిన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ (అఖిల భారత దళిత వర్గాల సంఘం) మహాసభలకు అధ్యక్షత వహించగా, ఈ మహాసభలను గాంధీ ప్రారంభించారు. డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌కు 1936 నుండి 1942 వరకు బాబూజీ అధ్యక్ష వహించారు. అదే సమయంలో బీహార్ శాసన మండలికి నామినేట్ అయ్యారు. 15 ఎస్‌సి రిజర్వుడు ఎమ్మెల్యే స్థానాలకు జగ్జీవన్ రామ్ అభ్యర్థులను పోటీకి దింపితే.. 15 నియోజక వర్గాలకు 15 మంది అభ్యర్థులు గెలిచారు. వీరిలో 14 మంది ఏకగ్రీవంగా ఎన్నిక కావడం మరో ముఖ్యమైన విశేషం. 1942 ఆగస్టు 7 న ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు జగ్జీవన్ రామ్ జైలుకు వెళ్ల వలసి వచ్చింది. కాగా అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌ను రద్దు చేసింది. 1943లో జగ్జీవన్ రామ్ జైలు నుండి విడుదలయ్యాడు. తర్వాత విస్తృత పర్యటనలు చేసి, సభలు, సమావేశాలు పెట్టి, దళిత వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి జగ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారు. 1946లో నెహ్రూ కేబినెట్ లో మొదటి మంత్రి మండలిలో జగ్జీవన్ రామ్ మొదటి కార్మికశాఖ మంత్రిగా చేరారు. మంత్రులందరిలోకెల్లా చిన్న వయసు కాబట్టి బాబూజీని 'బేబీ మినిస్టర్' అని పిలిచేవారు. అప్పటి నుండి 29 సంవ త్సరాలు కేంద్రమంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా, సెంట్రల్ పార్లమెంట్ బోర్డు సభ్యునిగా, పిసిసి అధ్యక్షునిగా, ఇంకా అనేక కీలక పదవులను బాబూజీ చేపట్టడం విశేషం. 1947లో రాజ్యాంగ పరిష త్తుకు బాబూజీ ఎన్నికయ్యారు. ఇదే ఏడాది ఐక్యరాజ్య సమితి అంత ర్జాతీయ కార్మిక మహాసభ అధ్యక్షునిగా బాబూజీ ఎన్నికయ్యారు. కేంద్ర కార్మిక శాఖ, వ్యవసాయం, ఆహారం, ఉపాధి, పునరావాసం, రక్షణ, రైల్వే, సమాచార శాఖలను మూడు దశాబ్దాలు ఎంతో బాధ్యతతో చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, నాయకత్వాల్లో, అణగా రిన వర్గాలకు ప్రాతినిధ్యం లభించడానికి బాపూజీ లైన్ ఎనలేనిది.

### కొత్త రాజకీయ పార్టీ-వడిదుడుకులు:

ఇందిరా గాంధీ ధోరణితో విసిగిపోయిన జగ్జీవన్ రామ్.. కాంగ్రెస్ పార్టీ నుండి విడిపోయి 'కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ' అనే పార్టీని స్థాపించారు. కొన్ని కారణాలతో తర్వాత ఇది జనతా పార్టీలో విలీన మైంది. 1977లో మురార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా జనతా పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో జగ్జీవన్ రామ్ కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా.. ఉప ప్రధాన మంత్రిగా 1979 వరకు కొనసాగారు. తర్వాత జనతా పార్టీ ప్రభుత్వం పడిపోయింది. మళ్లీ 1980లో బాబూజీ కాంగ్రెస్(జె) పేరుతో పార్టీని స్థాపించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మహాసభల్లో భాగంగా నిజామాబాద్, ఏపీలోని కృష్ణా, తూర్పుగోదావరి, ప్రకాశంలో మాదిగల దహనం విషయంలో సంద ర్శించినట్లు సమాచారం. బాబు జగ్జీవన్ రామ్ 1986 జూలై 6న ఆయన మరణించారు.

### బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు-అనుచరణ

1985లో దేశ ప్రజలు బాబూజీ జన్మదినోత్సవాన్ని 'సమతా దివస్'గా జరుపుకున్నారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశమంతటా 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. జూలై 7వ తేదీని రాష్ట్ర ప్రభుత్వాలు సంతాప సెలవు దినాన్ని ప్రకటించాయి. సాహసి, ఉద్య మకారుడు, పరిపాలనాదక్షుడు, విజేత అయిన బాబూజీ జీవితం ఒక గొప్ప విజయగాథ. ప్రజల్లో, కార్యకర్తల్లో, నేతల్లో స్ఫూర్తి రగిలి స్తూనే ఉంది. బాబూజీ జయంతి సందర్భంగా దేశంలో గౌరవంగా సెలవు దినంగా కొనసాగిస్తున్నాం. బాబూజీ కోసం తెలిసినవాళ్లు, తెలుసుకున్నవాళ్లు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. మిగతా తరమంతా ఏదో మొక్కుబడిగా స్మరించుకునే పరిస్థితి. దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన కేబినెట్ మంత్రిగా బాబూజీ రికార్డు సృష్టించారు. ఆయన కుమార్తె మీరా కుమార్ 2009-2014 వరకు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు. బాబూజీ విగ్రహాలకు నివాళులర్పిం చడం తప్పితే ఆశయాలను ఏమాత్రం ముందుకెళ్లని దుస్థితి. ప్రతి ఉన్నత రాజకీయ నేతలు బాబూజీ పేరుతో సమానత్వమంటూనే అసాంఘికతత్వాన్ని పోషిస్తున్నారు. అప్పట్లో బాబూజీ బరితెగింపు, ఆయన సమానత్వపు అంశం ఇప్పటి తరానికి తెగువ సరిపోవడం లేదు. జగ్జీవన్ రామ్ పేరుతో దళిత వర్గం నుంచి సానుభతి కోసం కొందరు నాయకులు మచ్చుకు కార్యక్రమాలు చేస్తున్నారే తప్పితే నాణ్యమైన స్ఫూర్తిని కొనసాగించడంపై దృష్టి పెట్టడం లేదు. మారుతున్న కాలానికి, టెక్నాలజీకి అనుగుణంగా బాబూ జగ్జీవన్ రామ్ గురించి విద్యాసంస్థల్లో సిలబస్ గా పెట్టాలి, ప్రతి ఏడాది ప్రధాని మంత్రి స్థాయి నుంచి రాష్ట్రాల సీఎంల వరకు జయంతి, వర్ధంతి రోజే తప్పితే స్ఫూర్తి గుర్తించేలా ఎలాంటి ప్రయత్నాలు లేవు.. ప్రస్తుత జనరేషన్ లోనూ ఎంతో కొంత సమానత్వపు లోపం కనిపి స్తూనే ఉంది. దానిపై బాబూజీ మార్గంలో ఉద్యమించే ప్రదర్శనలు లేవు. ఎంతో మందికి ఎన్నో రూపాల్లో గౌరవాన్ని నిలబెట్టుకుం టున్నాం.. అందులోనూ ఎంతో కొంత స్వర్థపరమైన సూత్రాలు ప్రతి క్షేపిస్తున్నాం.. జగ్జీవన్ రామ్ లాంటి మార్గదర్శకులను మాత్రం సంపూర్ణంగా స్మరించుకోలేకపోతున్నాం.. బాబూజీ జగ్జీవన్ రామ్ పై ప్రతి ఏటా స్పెషల్ సినిమాతో పాటు భారత రత్న పురస్కారం అందించుకొని సంపూర్ణ గౌరవాన్ని నిలబెట్టుకోవాల్సినవసరం ఉంది.

- పట్ట.హరిప్రసాద్, రైటర్, ఫోన్: 8790 84 3009

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 05.04.2026
www.mudranews.in | @mudranews




**కరెంట్ బిల్లు :** అవసరం లేని లైట్లు, పరికరాలు ఆఫ్ చేయండి. రూమ్‌లో లేని సమయంలో లైట్లు ఆఫ్ చేయడం అలవాటు చేసుకోండి. చిన్న అలవాట్లు పెద్ద సేవింగ్స్ ఇస్తాయి.




# ప్రత్యేక శిక్షణతో ఉత్తమ ఫలితాలు

**- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** గ్రామీణ వెనుకబడిన వర్గాల విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 30 రోజుల పాటు మెరిట్ స్కాలర్ షిప్ కోసం రెసిడెన్షియల్ స్థాయిలో అందించిన ప్రత్యేక శిక్షణ పొంది, మెరిట్ స్కాలర్ షిప్ సాధించిన విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు సరైన వాతావరణం, ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం ఉంటే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారన్నారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఐలు సహా అనేక మంది మద్దతు ఇవ్వనున్నారని, ప్రస్తుతం ఈ విజయాలు పెద్దగా ప్రచారం కాకపోయినా త్వరలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వందేమాతరం ఫౌండేషన్ రవీందర్, ఎఎంఓ శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, శ్రీ లలితాంబికా దేవి ఆలయ అధ్యక్షులు గుముడవెల్లి భాస్కర్, రామకృష్ణ మఠం రాజ మల్లేష్, పిఆర్టీయు సంఘం అధ్యక్షులు మధన్ మోహన్ యాదవ్, కార్పొరేటర్లు ఎంపి ప్రవీణ్ కుమార్, ఎస్. శేఖర్, ప్రశాంత్ , ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులు , వందేమాతరం కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి,సోంభూపాల్ రెడ్డి, నాయకులు అజ్మత్ అలీ, విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

**చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతానికి, కబ్జాలకు గురవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని మహాసభ ప్రతినిధులు,జాతీయ అధ్యక్షులు మెట్టుగాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ మహాసభ జిల్లా అధ్యక్షులు కుమ్మరి రాంచంద్రయ్య, నాయకులు ముత్యం స్వామి, కనికే క్రాంతికుమార్, మహబూబ్‌నగర్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, మైత్రి యాదయ్య, బాలగోపి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దనే ఎఫ్ఐఆర్ నమోదు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బాధితు లు పోలీస్ స్టేషన్ కు రావాల్సిన అవసరం లేకుండా, వారి ఇంటి వద్దకే వెళ్లి ఎఫ్ ఐఆర్ నమోదు చేసే ఆన్ సైట్



ఎఫ్ఐఆర్" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ తెలిపారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఏదైనా ప్రమాదం లేదా నేరం జరిగిన వెంటనే డయల్ 100 లేదా 112కు కాల్ చేయడం ద్వారా, లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారిని సంప్రదించడం ద్వారా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని తెలిపారు. ఈ సేవల ప్రధాన లక్ష్యం బాధితులు స్టేషన్ కు వెళ్లలేని పరిస్థితుల్లో వారికి సులభంగా న్యాయం అందించడం. ఈ కార్యక్రమం ద్వారా పోలీసింగ్ సేవలు మరింత సమర్థవంతంగా, బాధితులకు అనుకూలంగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 6న జాబ్ మేళా

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డైరీ సైన్స్ మరియు బీఎస్సీ లైఫ్ సైన్స్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఏప్రిల్ 6న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ జాబ్ మేళాలో జూనియర్ ఆఫీసర్ (అనిమల్ ఫార్మ్ డెవలప్‌మెంట్), ఎగ్జిక్యూటివ్ (అనిమల్ ఫార్మ్ డెవలప్‌మెంట్) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. డైరీ సైన్స్ మరియు బీఎస్సీ లైఫ్ సైన్స్ పూర్తి చేసిన వారు లేదా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9848289763 నంబర్‌ను సంప్రదించవచ్చు. అధ్యా పకులు అంజయ్య, ఉమాదేవి, దశరథం, ముజఫర్, నరేష్, రాఘవేందర్, శోభారాణి పాల్గొన్నారు.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** జిల్లా కేంద్రం లోని మర్లు ఎస్ ఆర్ నగర్ లో ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 80 ఇత్తడి కళశాలతో ఐదుగురు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కలశాలను పట్టుకుని మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం గుడి ప్రాంగణంలో హోమం నిర్వహించారు. మూల విగ్రహానికి అభిషేకం, అలంకరణ చేశారు. తీర్థ ప్రసాదాల అనంతరం అన్న దాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు శ్రీకాంత్ గౌడ్, చంద్రారెడ్డి, లక్ష్మినారాయణ, భాను ప్రకాష్, అనిల్, శంకర్ రెడ్డి, రాఘవేందర్, సుదర్శన్, శ్రీనివాస్ గౌడ్, గోపాల్, రాధికా గౌడ్, కవిత, లయ, చంద్రకళ, మంజుల, శ్వేత, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి




**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవ కార్యక్రమాల్లోనూ భాగస్వాములు అయ్యేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శనివారం గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అలాగే సామాజిక సమస్యలపై అవగాహన కలగడమే కాక వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. బి ఎస్ జి విద్యార్థులకు వారి శిక్షణ అనంతరం ఇచ్చే సర్టిఫికేట్ భవిష్యత్తులో వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాం క్షించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇతర అంశాలపై నైపుణ్యాలు పెరిగేందుకు శిక్షణ తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్కౌట్స్ విద్యార్థులు పరేడ్ నిర్వహించగా అతిథులు గౌరవ వందనం స్వీకరించారు విద్యార్థులు చేసిన వివిధ స్కిట్ ప్రదర్శనలు, స్వాగత నృత్యం ఆకట్టుకుంది. డీఈవో విజయలక్ష్మి, బీఎస్జీ రాష్ట్ర కోశాధికారి రాజగోపాల్, రాష్ట్ర శిక్షకులు అమర జ్యోతి, రవి కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణుకాదేవి, స్కౌట్ మాస్టర్లు కృష్ణ కుమార్, ప్రశాంత్ కుమార్, గైడ్ కెప్టెన్లు యాసిం కవిత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక సభ్యత్వంగల అతిపెద్ద పార్టీ బీజేపీ



**ముద్ర, గద్వాల:** ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వంతో అతిపెద్ద పార్టీగా బీజేపీ పార్టీ నిలిచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శనివారం గద్వాల పట్టణంలోని డికె. బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 5న ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగురవేసి సోషల్ మీడియాలో సరళ యాప్లో అప్లోడ్ చేయాలన్నారు. ఏప్రిల్ 6న ప్రతి పోలింగ్ బూత్ లో 5మందికి తప్పకుండా ఇంటిపై బిజెపి జెండా ఎగరవేయలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావ్, పట్టణ అధ్యక్షురాలు రజక జయ శ్రీ, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు అనిల్, మండల అధ్యక్షులు తిరుపతి రెడ్డి, శ్రీనివాసులు, బిజెపి నాయకులు డిల్లీ వాల కృష్ణ, శ్రీనివాసులు , అక్బర్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యకు 'షేరింగ్' తో చెక్



**ముద్ర, శేరిలింగంపల్లి :** ఐటీ కారిడార్ లో ట్రాఫిక్ సమస్యకు 'షేరింగ్' తో నియంత్రించవచ్చని మాన్యువల్ సర్వేలో వెల్లడయ్యింది. ఐటీ హబ్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్ లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. సాధ్యమైనంత వరకు రైడ్ షేరింగ్ పద్ధతిని పాటించాలని, సహోద్యోగులు లేదా స్నేహితులతో కలిసి కార్ పూలింగ్ చేయాలని, మెట్రో మరియు బస్సు వంటి పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ వినియోగాన్ని పెంచాల ని, పీక్ అవర్స్ లో అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించాలని, పాఠశాల, కళాశాల వాహనాలు నడిచే రద్దీ సమయాల్లో ప్రయాణించకుండా ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ సర్వే కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ–I హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ఎస్ హెచ్ఓ శ్రీధర్ కుమార్, ఆర్.ఐ శ్రీకాంత్, ఎస్ఐలు టీవీ రావు, రాములు మరియు సిబ్బంది పాల్గొని అవగాహన కల్పించారు. ఐటీ ఉద్యోగులు మరియు సాధారణ పౌరులు తమ ప్రయాణాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ రహిత సైబరాబాద్ ను నిర్మించవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పాలమూరుకు శనీశ్వరుడు హరీష్ రావు

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** పాలమూరు జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిన మాజీ మంత్రి హరీష్ రావును దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శనీశ్వరునితో పోల్చారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం తిమ్మారెడిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రెస్మీట్ లో హరీష్ రావు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై చేసిన ఆరోపణలను ఖండిస్తూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడంగల్ కు విహారయాత్రకు వచ్చిన హరీష్ రావు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిపోయారని, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై అసత్య ఆరోపణలు చేస్తున్నరన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి చేసిన మోసాలు, దోపిడీలు ప్రజలకు తెలుసన్నారు. అసెంబ్లీలో ఉతికి ఆరేశామంటూ అవా కులు, చవాకులు పేలుచుతున్నవని, అసలు నువ్వు అసెంబ్లీలో ఎక్కడున్నావని ప్రశ్నించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పేరు మీద దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే అల వెంకటేశ్వర్ రెడ్డి దోచుకున్న నల్ల మట్టిలో మీకు కూడా వాటా ఉందని ఆరోపణలు చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఫయాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఆవేజ్ అహ్మద్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్ , బెనహర్, అజ్మత్ అలీ పాల్గొన్నారు.

## కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి దుర్మార్గం

**ముద్ర, నారాయణ పేట:** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన దాడి దుర్మార్గమని నారాయణపేట జిల్లా బీ ఆర్ ఎస్ అధ్యక్షులుఎస్. రాజేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత కార్యాలయంపై దాడి సిగ్గు చేటన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యల ను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికార అహంకారంతో హద్దులు దాటుతున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తున్న వారిని భయపెట్టేందుకు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిం చారు.

**పిరికిపంద చర్య**

**ముద్ర, తాండూర్:** మాజీ ముఖ్యమంత్రి, కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడి పిరికిపంద చర్య అని బీ ఆర్ ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు అన్నారు. ప్రజలే మీకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

**దాడి దుర్మార్గం**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** బి ఆర్ ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి వర్యులు కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడాన్ని తీవ్రం గా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు గుండాల్ల వ్యవహరిస్తున్నారని అన్నారు.

## వైద్యాధికారుల పనితీరు మెరుగుపడాలి

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అన్ని పీహెచ్సీలు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రిల్లో బయోమెట్రిక్ విధానంలో హాజరు తప్పనిసరి చేయాలని, యంత్రాల్లో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకుని వినియోగించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాల్సి ఉందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి పాల్గొన్నారు.

## గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** గ్రామ ప్రజల భద్రతను పెంపొందించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. శనివారం కల్వకుర్తి మండలంలోని తాండ్రా గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆశాదీప్ రెడ్డి తన సొంత నిధులు రూ.12.50 లక్షలతో ఏర్పాటు చేసిన 67 సీసీ కెమెరాలను కలెక్టర్ ప్రారంభించారు. రూ.70 లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చదువుకున్న ఈ పాఠశాల నిర్మాణాన్ని ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయాలన్నారు. తహసిల్దార్ ఇబ్రహీం, సాయి రెడ్డి పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** తాడూరు మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు తగిన ధర లభించి, వారి ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ రామచంద్ర రెడ్డి, సర్పంచ్ మల్లయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**

జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన



**ముద్ర, గద్వాల:** కేటిదొడ్డి గ్రామంలోని ఊరొద్ద వాగు పై హై లెవల్ వంతెన నిర్మాణానికి శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి స్థానిక రైతులతో కలిసి ఊరొద్ద వాగును సందర్శించారు. వర్షాకాలంలో అధిక వర్షాలతో వాగులు ఉధృత్తంగా ప్రవహిస్తున్న క్రమంలో పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులుగా మారుతోందని, గ్రామంలో వరద నీరు వచ్చిచేరే అవకాశం ఉందని, రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్న సమస్యలను స్థానిక నేతలు, రైతులు గద్వాల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన గద్వాల ఎమ్మెల్యే శనివారం ఊరొద్ద వాగు బాటను పరిశీలించారు. ఊరొద్ద వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే వెంటా గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, కేటిదొడ్డి సర్పంచు నారాయణ, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



**ముద్ర, కాప్రా:** రాజకీయాలకు తావు లేకుండా అన్ని కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కాప్రా, శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అభివృద్ధి పనులకు ప్రభుత్వము మంజూరు చేసిన 20 లక్షల నిధుల ప్రొసీడింగ్ కాపీలను శనివారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి, కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ లు శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి సుభాష్ రెడ్డికి కి అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగునున్నట్లు తెలిపారు, కాలనీ సంక్షేమ సంఘాలు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమను సంప్రదించాలని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. నాయకులు శంకర్రావు, సుబ్బారావు, సంతోష్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

## పరిహారం ఇచ్చిన తరువాత పనులు చేపట్టాలి

**ముద్ర, నారాయణపేట:** నారాయణపేట కొడంగల్ పథకంలో భాగంగా శనివారం దామరగిద్ద మండలం కానుకుర్తి రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తో పాటు అధికారులు సిద్ధమయ్యారు. మల్రెడ్డిపల్లి గ్రామంలో పలువురు రైతులు తమకు ఇప్పటివరకు నష్టపరిహారం చెక్కులు అందలేదని నష్టపరిహారం చెక్కులు అందించిన తర్వాతనే పనులు ప్రారంభించాలని అధికారులకు తేల్చి చెప్పారు. తాము ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, కానీ వేరే చోట వ్యవసాయ భూమి కొనుగోలు కోసం అడ్వాన్స్ ఇచ్చామని అగ్రిమెంట్ సమయం దాటిపోతే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇలా ఉండగా నారాయణపేట ఎత్తిపోతల పథకానికి గాను సుమారు 2312 ఎకరాలు అవసరం ఉండగా ఇందులో 3591 మంది బాధిత రైతులు ఉన్నారు. జనవరి 4వ తేదీన నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో మంత్రి వాకిటి శ్రీహరి పలువురు నారాయణపేట కొండగల్ ఎత్తిపోతల పథకం బాధితులకు అందించారు.

## అభివృద్ధి పనుల్లో రాజీ పడే ప్రసక్తే లేదు

**ముద్ర, కూకట్‌పల్లి :** నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులపై చర్చించారు.జేఎన్టీయూ చౌరస్తా వద్ద స్కైవాక్ నిర్మాణం మూసాపేట వై జంక్షన్ వద్ద అండర్ పాస్ పనుల వేగవంతం.సర్దార్ నగర్లోని హిందూ స్మశాన వాటిక ప్రారంభోత్సవం. రాజు కాలనీలోని స్థలాన్ని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికే కేటాయించాలని విన్నవించారు. బండి రమేష్ వినతిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే అనుమతులు పొందిన పనులను తక్షణమే ప్రారంభిస్తామని, కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.3,94,000 విలువైన చెక్కులను శనివారం పార్టీ కార్యాలయంలో బండి రమేష్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, గాలి బాలాజీ, పుష్ప రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, పులి శివకుమార్ గౌడ్, గోపాల్ చౌదరి పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**ముద్ర, కాప్రా:** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ, నేతాజీ నగర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్య, నాయకులు రోహిన్,అంబటి వెంకటాచలం, రజినీకాంత్ రెడ్డి తీవ్రంగా ఖండిస్తూ, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాప్రా డివిజన్ అధ్యక్షుడు శాంతి కిరణ్, సీనియర్ నాయకులు, సోమేశ్ నాయుడు, రాజు యాదవ్, శ్రీధర్ సంపత్ మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బస్సుల్లేక విద్యార్థుల అగచాట్లు



**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లాలోని రాజోలి మండలంలో గల పెద్ద ధన్వాడ గ్రామానికి పదేళ్లుగా ఆర్టీసీ బస్సు రావడం లేదు. దీంతో పెద్ద ధన్వాడ నుంచి అయిజ మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామంలో గల జెడ్పీహెచ్ఎస్ లో చదువుతున్న విద్యార్థులు సుమారు 5 కి.మీ నడుచుకుంటు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దధన్వాడ గ్రామానికి వెళ్లే రోడ్డు పై ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు గుంతలమయంగా మారడంతో ఆర్టీసి బస్సులను నిలిపివేశారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 05.04.2026
www.mudranews.in | @mudranews



**కరెంట్ బిల్లు:**

ఎల్.ఈడీ బల్బులు వాడండి

పాత బల్బులతో పోలిస్తే LEDలు 80% వరకు విద్యుత్ ఆదా చేస్తాయి.జీవితకాలం కూడా ఎక్కువగా ఉంటుంది.




# భక్తుల విశ్వాసాలను గౌరవించాలి

**- బాసర అభివృద్ధి పనులు శాస్త్ర సమ్మతంగా ఉండాలి**
**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**- ఆలయ మాస్టర్ ప్లాన్ ను సీఎంకు వివరించిన అధికారులు**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధి పనుల్లో భక్తుల విశ్వాసాలను గౌరవించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బాసర మాస్టర్ ప్లాన్ అమలు నేపథ్యంలో అధికారులు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్ లో కలిశారు. ఈ నెల 6న సోమవారం అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో వారు సీఎం ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆలయ పవిత్రతకు ఏమాత్రం భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆయన ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ లోని తిరుమల తర హాలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల పరిసరాల్లో ఏలాంటి రాజకీయ కార్యకలా పాలు జరగకుండా నిబంధనలు ఉండాలని దిశా నిర్దేశం చేశారు.

## 13 నుంచి పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞం



**కోరుట్ల, ముద్ర:**
కోరుట్ల పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈ నె 13 నుంచి శ్రీ మహా వరాహ పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞము నిర్వహించనున్నారు. శనివారం నిర్వాహకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రసిద్ధ శృంగేరి ఆస్థాన పండితుడు, పురాణ ప్రవర, బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ ప్రవచనాలు అందించనున్నట్లు తెలిపారు. శ్రీ మహా వరాహ స్వామి మహిమ, ధర్మ పరిరక్షణ, భక్తి మార్గం వంటి విశిష్ట అంశాలపై ఆయన ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మికంగా ప్రేరేపిస్తాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 13 నుంచి 19 వరకు ప్రతి రోజు సాయంత్రం 6.00 గంటల నుండి 7.30 గంటల వరకు ఈ ప్రవచనాలు నిర్వహించబడుతాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ ధార్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## శుభకార్యానికి వెళ్లి వస్తుండగా అనంత లోకాలకు..

**- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి**

**కోరుట్ల, ముద్ర:**



శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇద్దరు యువకులు మృతి చెందారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి శివారులోని మోహన్ రావు పేట బ్రిడ్జి సమీపంలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహ నంపై వెళ్తున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం అరవెల్లి గ్రామానికి చెందిన గాలిపెల్లి ఆదిత్య (21), మహారాష్ట్ర భీవండి కి చెందిన విగ్నేష్ (17) ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై మల్లాపూర్ మండలంలోని ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోరుట్ల మండలం మోహనరావుపేట గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదిత్య తల్లి అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రోడ్డుపై నిర్లక్ష్యంగా ఎలాంటి సంకేతాలు లేకుండా లారీని నిలిపి ఇద్దరి మృతికి కారణమైన లారీ డ్రైవర్ తిరుపతి మీద కేసు నమోదు చేశారు. ఘటనపై కోరుట్ల సీఐ సురేష్ బాబు దర్యాప్తు ప్రారంభించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి**
**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రైతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. శనివారం జగిత్యాల వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నా అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జిల్లా లో 46 వేల ఎకరాల్లో, నియోజకవర్గం 14 వేల ఎకరాల్లో మొక్క జొన్న పంట సాగు చేశారని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కోరగానే సానుకూలంగా స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు మంజూరు చేశారన్నారు. కేంద్రం మద్దతు ధర రూ.2400 గా పెట్టినా కేంద్రం మక్కలు కొనుగోలు చేయటం లేదన్నారు. మొక్కజొన్న పంట కేంద్రం కొనుగోలు చేసి మద్దతు ధర అందజేయాలన్నారు. తెలంగాణ మార్క్ ఫెడ్ 10 వేల కోట్ల నష్టాల్లో ఉందని, రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రైతులు ఒకే రకమైన వరి లాంటి పంట కాకుండా ఇతర పంటల సాగుపై మొగ్గు చూపాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంట సాగు తో లాభదాయకమని, టన్ను కి రూ.23 వేలతో రైతుకు లాభం కలుగుతుందన్నారు. అంతర్ పంటగా కోకో పిట్ కూడా వేసుకోవచ్చని, ఫామ్ ఆయిల్ పంట సాగు తో ఫామ్ ఆయిల్ ధర నేడు బంగారంలా ఉందని, ఆ వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ప్రకాష్, డిఏఓ భాస్కర్, మార్క్ ఫెడ్ డీఎం హబిబ్, తహసీల్దార్ రామ్మోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్, చిక్కులభూమయ్య , మహేశ్వర్ రావు, బాలే శంకర్, సురేందర్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ లు, కౌన్సిలర్ లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి పదవి ఇస్తే పార్టీకి రాజీనామా చేసేవారా..?

**- డీసీసీ అధ్యక్షుడు నందయ్య**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
ఎమ్మెల్సీ రెన్యువల్ చేసి, మంత్రి పదవి ఇస్తే పార్టీకి రాజీనామా చేసేవారా అని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల అర్హతలున్నా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని జీవన్ రెడ్డి అనడం తగదన్నారు. ఏనాడు పార్టీ కార్యకర్తలను ఊరి పొలి మేర కూడా దాటనివ్వలేదని ఆరోపించారు. జగిత్యాల లోని ఇం దిరా భవన్ తప్ప, గాంధీ భవన్ తెలియదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకముందు కాంగ్రెస్ పార్టీ కొన ఊపిరితో వెంటిలేటర్ పై ఉందన్నారు. దాన్ని రేవంత్ రెడ్డి ప్రాణాలతో బ్రతికించాడని పేర్కొన్నారు. 20 సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీని విమర్శించిన జీవన్ రెడ్డి ఇప్పుడు కాళేశ్వరం లేక పోతే తెలంగాణనే లేదనే విధంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. కేవలం నెల రోజులలోనే బీఆర్ఎస్ పార్టీపై ఇంత ప్రేమ వచ్చిందో ప్రజలకు చెప్పాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా తాను ఆయన వెంటే ఉన్నానని, పార్టీ ఎన్నడు జీవన్ రెడ్డిని ఇబ్బంది పెట్టలేదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గట్టు సతీష్, రవీందర్ రెడ్డి, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆంజనేయులు



**కోరుట్ల, ముద్ర;**
కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తోట ఆంజనేయులు ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు శాంతియుతంగా నిర్వహించారు. సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎండీ. మెబీన్ పాషా, గోసికొండ సురేష్, సూర్యనారాయణ ప్రసాద్ లు వ్యవహరించారు. ఈ ఎన్నికలలో బార్ అసోసియేషన్ కార్యదర్శిగా సుతారి శ్రీనివాస్, కోశాధికారిగా చింతకింది ప్రేమ్ కుమార్, ఉపాధ్యకులుగా అంబల్ల నాగ నిర్మల ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన వారిని జూనియర్ సివిల్ జడ్జి కాసుల పావని, అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## ప్రజల పోరాటానికి అండగా ఉంటా..



**ముద్ర, కరీంనగర్:** ప్రజల పోరాటానికి తాను ఎప్పటికీ అండగా ఉంటానని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. హుజురాబాద్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమానికి ఎంపీ మద్దతు ప్రకటించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని, ప్రజల ఆందోళనకు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో హుజురాబాద్ తో పాటు పరిసర గ్రామాలు విషతుల్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఈ ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం కాదు, ప్రజల సమస్యల కోసం తాను వచ్చానన్నారు. ప్రజల జీవితం ప్రమాదంలో పడేలా చేసే నిర్ణయాలను అంగీకరించమని పేర్కొన్నారు.

జవహర్‌నగర్, బాలాజీ నగర్ డంప్ యార్డ్‌ల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉదాహరణగా చూపిస్తూ, అలాంటి పరిస్థితి హుజురాబాద్‌లో రావద్దని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్‌ల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవడం, చెరువులు నాశనం కావడం, అనేక రకాల రోగాలు వ్యాపించడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. చెత్తను ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తామని చెప్పే యంత్రాలు ప్రాక్టికల్‌గా పనిచేయవన్నారు. అవి ప్రజలను మోసం చేసే ప్రయత్నమని విమర్శించారు. ట్రీట్మెంట్ ప్లాంట్లు పేరుకే ఉంటాయి, కానీ నిర్వహణ సరిగా ఉండదన్నారు. రాత్రిపూట చెత్త నీటిని కాలువల్లో వదిలేస్తారని ఆరోపించారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే నిర్ణయాలను తీసుకోకూడదని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్‌ను నిలువరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. మాటలు కాదు, ఆచరణ కావాలన్నారు. అవసరమైతే ఉద్యమానికి నాయకత్వం వహించేందుకు సిద్ధమని ఈటల రాజేందర్ వెల్లడించారు. హుజురాబాద్ ఇచ్చిన పోరాట స్ఫూర్తితోనే ఎప్పటికీ ప్రజల పక్షాన నిలుస్తానన్నారు.

## బాలల హక్కులు పరిరక్షించాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** బాలలు కూడా సమాజంలో ఒక భాగమని, వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు ప్రమీల అగర్వాల్ అన్నారు. నిర్మల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆమె శనివారం పర్యటించారు. మామడ మండలం జగదాంబ తండా అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, పిల్లలతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. పిల్లలకు సరైన సమయంలో పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం కొండాపూర్ బాలసదనం సందర్శించి పిల్లలతో మాట్లాడారు. పిల్లలను సక్రమంగా చూసుకోవాలని, వారికి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, సీడబ్ల్యూసీ మెంబర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి మురళి, బాలసదనం సూపరిండెంట్ వైష్ణవి , సూపర్వైజర్ రజిని, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ వ్యక్తికి చేయూత

**కోరుట్ల, ముద్ర:** వారం రోజుల క్రితం జరిగిన వీరహనుమాన్ విజయ యాత్రలో గుర్రాల రాజ్ అనే యువకునికి ముక్కు కి బలమైన గాయం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రాజ్ కు ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కోరుట్ల పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూప్ రావు వెంటనే స్పందించారు. రేనీ ఆసుపత్రి డాక్టర్ సూచన మేరకు ఆపరేషన్ చేయాలనీ సూచించగా వెంటనే కరీంనగర్ లోని ప్రముఖ ఈ ఎన్ టి హాస్పిటల్ లో తన సొంత ఖర్చులతో ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ కు సహకరించిన డాక్టర్ అనూప్ రావు కు కోరుట్ల భజరంగ్ దళ్ నాయకులు కళ్యేడ రోహిత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మినారాయణ, రాష్ట్ర ఓబీసీ ఉపా ధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కౌన్సిలర్ ఇందూరి తిరుమల వాసు, బీజేపీ నాయకులు మాడవేణి నరేష్, సుదవేణి మహేష్, గిన్నెల శ్రీకాంత్, తులసి కృష్ణ, బేక్కం అశోక్ పాల్గొన్నారు.

## గ్రామ సభల పేరుతో ప్రజాధనం వృథా



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** గ్రామ సభలు వార్డు సభల పేరుతో ప్రజాధనం వృధా అవుతోందని జడ్పి మాజీ చైర్ పర్సన్ దావ వసంతా సురేష్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామసభలు, వార్డు సభలు ఎందుకోసం, ఎవరి కోసం అని ప్రశ్నించారు. గతంలో ప్రజాపాలన పేరు మీద దరఖాస్తులు తీసుకొని ఒక్కదాని కూడా సమస్యకు పరిష్కారం దొరికిందా? అని ఆమె ప్రశ్నించారు. గ్రామసభలు, వార్డు సభలు ప్రభుత్వం ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని, కానీ ఏదో నామమాత్రంగా సభలు నిర్వహించారన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
05.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## కరెంట్ బిల్లు : ఫ్రిజ్ డోర్ ఎక్కువసేపు తెరిచి పెట్టవద్దు

చల్లని గాలి బయటకు పోయి మోటార్ ఎక్కువ పని చేస్తుంది. ఇది విద్యుత్ వినియోగాన్ని పెంచుతుంది.






## ప్రభుత్వ స్కూల్లోనే విద్యార్థులను చేర్పించాలి

**ముద్ర, తుంగతుర్తి:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను విధిగా చేర్పించాలని రావులపల్లి సర్పంచ్ చింతకుంట్ల మనోజ్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ గ్రామంలో నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం లను ప్రభుత్వం అందిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.



## స్టేడియంలో ధాన్యం పోయవద్దు...

**ముద్ర తుంగతుర్తి:**
మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ధాన్యం ఆర పోయవద్దంటూ క్రీడాకారులు, యువకులు శనివారం తహశీల్దార్ దయానందంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ.. మినీ స్టేడియంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో మార్నింగ్ వాకర్స్, ఈవినింగ్ వాకర్స్ లకు ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ప్రతి సారి మినీ స్టేడియంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నిర్లక్ష్యంగా చెత్తాచెదారం, రాళ్లు వదిలేసి వెళ్ళిపోతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మదూరి రమేష్, ఉప్పుల రాంబాబు, ఎల్లబోయిన శ్రీకాంత్, భాష, జవాజి నాగరాజు, ఆంజనేయులు, తాడూరి సైదులు తదితరులు ఉన్నారు.



## 6నుంచి ప్రజానాట్యండలి మహాసభలు

**ముద్ర, చిట్యాల:**
ప్రజానాట్యమండలి నల్లగొండ జిల్లా 8 వ మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యజిల్లా కమిటీ సభ్యుడు జిట్ట స్వామి పిలుపునిచ్చారు. శనివారం చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో సభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా నాట్య మండలి జిల్లా 8వ మహాసభలు ఏప్రిల్ 6, 7 తేదీల్లో నల్గొండ పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పోరాటాల గడ్డ నల్లగొండ అని, అభ్యుదయ వాదులు మేధావులు ప్రజలు సహకరించి కళాకారులు పాల్గొని సభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి చిట్యాల మండలం అధ్యక్షులు మేడి లింగస్వామి, మేడి సునీత, మేడి రాణి, వేడి గోపమ్మ, భద్రము, ఐలమ్మ పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**
భువనగిరి పట్టణంలోని 29వార్డ్ లో హెచ్ఎండిఏ నిధులతో సీసీ రోడ్ ను భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో భువనగిరి మున్సిపల్ అభివృద్ధి పదం వైపు సాగుతుందని తెలిపారు. రానున్న రోజులలో మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీ గా అభివృద్ధి చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, గ్యాస్ చిన్న, దొంత సావిత్రి, నర్సింహా, శ్రీధర్, వెంకటేష్, నితీష్ పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**




రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. శనివారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన నేషనల్ హీట్ రిలేటెడ్ ఇల్లినెస్ అండ్ డెత్ సర్వేలైన్స్ డిస్టిక్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశుసంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ కాలుష్య నివారణ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో కలెక్టరేట్ ఐడీఓసీ మినీ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు వడదెబ్బ వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలతో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యం.మనోహర్ మాట్లాడుతూ, జిల్లా లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఇప్పటికే ప్యాకెట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పంపడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశుసంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ కాలుష్య నివారణ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 6 నుంచి ప్రజా పాలన

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ నెల 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం కలెక్టరేట్ లో జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. 6న ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే సందర్భంగా ఆహార కల్తీపై ప్రజల్లో అవగాహన పెంపు కోసం ఉదయం 6:30 గంటలకు భువనగిరి పాత బస్ స్టాండ్ నుండి వినాయక చౌరస్తా ద్వారా జూనియర్ కాలేజీ గ్రౌండ్ వరకు ఈట్ రైట్ వాక్, అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. 7న వరల్డ్ హెల్త్ డే ను పురస్కరించుకొని జిల్లా స్థాయిలో హెల్త్ ప్రతిజ్ఞ, ఉత్తమంగా సేవలందిస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పరామెడికల్ సిబ్బందికి అవార్డులు ప్రదానం చేస్తామని, 8న సేఫ్ మదర్ డే సందర్భంగా మాతృ, శిశు మరణాలను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు, 9న ఎయిడ్స్ అవగాహన & నివారణ దినం, 10న ఆయుష్, హోమియోపతి దినం, 11న డ్రగ్స్ కంట్రోల్, రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే సందర్భంగా ప్రభుత్వం, తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎం.మనోహర్, ఎస్.చిన్న నాయక్, రాజేందర్ పాల్గొన్నారు.



## తాగు నీటి ఎద్దడిని నివారించాలి

**ముద్ర, నడిగూడెం:**
వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్ అన్నారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలో వేసవికాలంలో తాగు నీటి ఎద్దడి రాకుండా చేపడుతున్న చేతి పంపుల మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచినీటి సరఫరా చేసేందుకు ప్రత్యేక నిధుల కేటాయించాలని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ ఈ ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఇర్ఫాన్, పంచాయతీ కార్యదర్శి, యలక ఉమారాణి, వార్డు సభ్యులు షేక్ నాజియా రియాజ్, మిషన్ భగీరథ సిబ్బంది వెంకన్న, గ్రామ పంచాయతీ సిబ్బంది నాగరాజు, సుభాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ దాడులకు భయపడదు

- సూర్యాపేట మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దీపికా

**ముద్ర, తుంగతుర్తి:**



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సూర్యాపేట జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒకపక్క ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరలించేందుకు కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చౌకబారు పనులకు పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శాంతి భద్రతలు కేసీఆర్ పాలనలో ఏ విధంగా ఉండేవో.., నేటి కాంగ్రెస్ పాలనలో ఏ విధంగా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రజలు తగిన సమయంలో తగిన రీతిలో కాంగ్రెస్ పాలకులకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

## తహశీల్దార్ కు సన్మానం

**ముద్ర, నడిగూడెం:**




నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నడిగూడెం మండల తహసిల్దార్ సూరయ్యకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఎండి ఖలీల్ అహ్మద్, కార్యదర్శి బాలాజీ నాయక్, ఆర్థిక కార్యదర్శి ఎండి ఇబ్రహీం, అసోసియేట్ అధ్యక్షుడు అలుగుబల్లి అప్పారెడ్డి, కార్యవర్గ సభ్యులు డి అంజయ్య, టి వెంకటేశ్వరరావు, వేపూరి రాములు, పందిరి వెంకట్ రెడ్డి, మన్నెం నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల కోసం అలుపెరగని పోరాటం

- విక్రమ్ రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే మందుల సామేల్

**ముద్ర, తుంగతుర్తి**



ప్రజా సమస్యల కోసం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి నమ్మిన సిద్ధాంతానికి నైతిక విలువలకు ఆదర్శాలకు మార్గదర్శకంగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి దాయం విక్రమ్ రెడ్డి అని ఎమ్మెల్యే మందుల సామెల్, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం అన్నారు. మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు రాజకీయాల్లో ఎలాంటి మచ్చలేని గొప్ప వ్యక్తిత్వం కలిగిన తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దాయం విక్రం రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించిన సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాయం విక్రమ్ రెడ్డి రాజకీయ జీవితంలో దాదాపు 30 ఏళ్ల పాటు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కీలక పాత్ర పోషించారన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ప్రజానాయకుడిగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి బండ ప్రకాశ్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మల్లు కపోతం రెడ్డి,పలు గ్రామాల సర్పంచులు, వివిధ పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలపై ఇంటింటికి సీపీఐ

**ముద్ర ప్రతినిధి,భువనగిరి :**
ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆలస్యం జరుగుచున్నదని, స్థానిక సమస్యలపై త్వరలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించ బోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, నాయకులు బద్దం వెంకట్ రెడ్డి, చింటూ, శేఖర్ పాల్గొన్నారు.



## కేసిఆర్ క్యాంప్ ఆఫీస్ పై దాడి హేయమైన చర్య

**ముద్ర,మోత్కూర్:**
తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని దౌర్జన్యానికి పాల్పడటం పిరికిపందుల చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ అన్నారు. శనివారం ఆయన మోత్కూర్ లో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించి ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్ క్యాంపు ఆఫీస్ పై అల్లరి మూకలు దాడి చేయడం రాజ్యాంగ విరుద్ధమని అల్లరి ముఖలపై చట్టరీత్యా చర్య తీసుకుని, వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. కెసిఆర్ క్యాంప్ ఆఫీస్ పై దాడి అంటే తెలంగాణ రాష్ట్ర యావత్ ప్రజానీకంపై దాడి చేసినట్టేనని ఆయన అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## నడిగూడెం నియోజకవర్గం కావాలి

**ముద్ర, నడిగూడెం:**
కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డీ లిమిటేషన్ ప్రక్రియలో భాగంగా నడిగూడెం మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని విద్యార్థి నాయకుడు బెల్లంకొండ నవీన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న డీ లిమిటేషన్ విధానం శుభపరిణామమని పేర్కొన్నారు. అదేవిధంగా, చారిత్రక ప్రాధాన్యత కలిగిన నడిగూడెం కోటకు సరైన గుర్తింపు లభించకపోవడం బాధాకరమని తెలిపారు. ఆనాటి నడిగూడెం రాజా నాయని వెంకట రంగారావు ఆస్థానంలో పనిచేసిన పింగళి వెంకయ్య భారత జాతీయ కాంగ్రెస్ సభలో నడిగూడెం కోట నుంచే జాతీయ జెండా రూపకల్పన చేసి సమర్పించిన విషయం గర్వకారణమని గుర్తుచేశారు. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న నడిగూడెంను నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కరెంట్ బిల్లు : ఎసీ ఫిల్టర్లు రెగ్యులర్‌గా క్లీన్ చేయండి**

డస్ట్ ఉన్న ఫిల్టర్లు ఎసీ పనితీరును తగిస్తాయి. క్లీన్ చేస్తే పవర్ సేవింగ్ కూడా, కూలింగ్ కూడా బెటర్.



# రేపటి నుంచి హెల్త్ వీక్

- వారం రోజుల పాటు విస్తృత కార్యక్రమాలు
- ఉన్నతాధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు హెల్త్ వీక్ నిర్వహించనున్నారు. హెల్త్ వీక్‌లో రోజువారీగా చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో శనివారం మంత్రి దామోదర్ రాజనర్సింహ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హెల్త్ వీక్‌లో చేపట్టనున్న కార్యక్రమాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేలా, ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేసేలా కార్యక్రమాలు ఉండాలని సూచించారు. ప్రతి రోజు ప్రత్యేక థీమ్‌తో నిర్వహించే కార్యక్రమాల వివరాలను సమీక్షించిన మంత్రి, అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. హెల్త్ వీక్‌లో భాగంగా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో విద్యార్థులు, మహిళలు, యువత భాగస్వాములు కావాలని సూచించారు. ఆహార నాణ్యత ప్రాముఖ్యతను తెలియజేసేలా ఏప్రిల్ 6న ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్ వద్ద 'ఈట్ రైట్' వాక్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి నేచురోపతి హాస్పిటల్‌లో 40 స్టాళ్లతో మిల్లెట్ మేళా నిర్వహించనున్నారు. ఇదే కార్యక్రమంలో ఫుడ్ హ్యాండ్లర్లకు శిక్షణ, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు సర్టిఫికేట్ల పంపిణీ, హైజీన్ రేటింగ్ సర్టిఫికేట్ల పంపిణీ చేపట్టనున్నారు. జిల్లాల్లో కూడా ఉదయం 'ఈట్ రైట్' వాక్‌లు, మధ్యాహ్నం ఫుడ్ రిజిస్ట్రేషన్ మేళాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. క్యాన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు నిమ్స్‌లో ఏర్పాటు చేసిన అధునాతన లీనాక్ యంత్రాన్ని ఉదయం 10 గంటలకు మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

**6 నుంచి హెల్త్ వీక్ : కలెక్టర్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

హెల్త్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి 11 వరకు వారం రోజులపాటు హెల్త్ వీక్‌ను అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. హెల్త్ వీక్‌లో భాగంగా జిల్లా, గ్రామీణ స్థాయిలో ప్రజలందరి భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని సాధ్యమవుతాయని పేర్కొన్నారు. మహిళలు, చిన్నపిల్లల అనారోగ్య సమస్యలపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. వివిధ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేసిన వారికి తిరిగి చికిత్స అందించాలన్నారు. ఎయిడ్స్, క్యాన్సర్, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, సిసెక్షన్, అనీమియా, మత్తు పదార్థాల వినియోగం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆరు రోజుల కార్యక్రమాలకు నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. 'ఈట్ రైట్', ఎయిడ్స్ అవగాహన, యోగ సేవ, మదర్స్ డే వంటి కార్యక్రమాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు వాక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డీసీహెచ్ శివదయాల్, జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డ్రగ్స్ నియంత్రణ అధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్, పెట్రోల్ కొరత లేదు

- జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



గ్యాస్, ఇంధన సరఫరాపై వస్తున్న వదంతులను నమ్మవద్దని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ సూచించారు. మెదక్ జిల్లాలో ఎటువంటి గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎక్కడా లోటు లేదని, బుకింగ్ చేసిన వారికి యథావిధిగా డెలివరీ జరుగుతోందని తెలిపారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని నిత్యానంద్ తీవ్రంగా ఖండించారు. జిల్లాలో గ్యాస్ సరఫరా సమృద్ధిగా ఉందని చెప్పారు. ప్రస్తుతం రోజుకు సగటున 2,300 సిలిండర్లు బుక్ అవుతుండగా, వాటికి 100 శాతం డెలివరీ జరుగుతోందన్నారు. అదనంగా జిల్లాలోని గ్యాస్ గోదాముల్లో సుమారు 4,300 సిలిండర్లు నిల్వ ఉండగా, మరో 5,000 సిలిండర్లు ట్రాన్సిట్‌లో ఉన్నాయని వివరించారు. జిల్లాలో మొత్తం 87 పెట్రోల్ బంకులు, 16 గ్యాస్ ఏజెన్సీలు సక్రమంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలను అరికట్టేందుకు సివిల్ సప్లైస్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, పోలీస్ శాఖల సంయుక్త బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్, పౌర సరఫరాల శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల బృందాలు మెదక్ పట్టణంలో పలు హోటళ్లు, రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు నిర్వహించి 134 సిలిండర్లను స్వాధీనం చేసుకుని, 83 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం లేదా చమురు కంపెనీల అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని సూచించారు. గ్యాస్, ఇంధన కొరత లేదని, ప్రజలు సంయమనం పాటించాలని కోరారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

- కలెక్టర్ ప్రావీణ్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఈ నెల 5 ఆదివారం ఉదయం 9.00 గంటలకు ఆర్అండ్ బి కార్యాలయం పక్కన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని నటరాజ్ థియేటర్ పక్కన, కల్వకుంట రోడ్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, బడుగు, బలహీన వర్గాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మరో 10 ఏళ్ళు కాంగ్రెస్ పార్టీదే అధికారం

- సిద్ధిపేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట :**

రాష్ట్రంలో మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీదే అధికారం ఉంటుందని, అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని సిద్ధిపేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో 11వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలు ప్రజలు అధికారం ఇచ్చినా రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేశారని ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలుచేసి, లక్షల కోట్లు కేసీఆర్ కుటుంబం దోచుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ కుటుంబం చేసిన అప్పులకు వడ్డీ చెల్లిస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను కేసీఆర్ మోసం చేశారని, అందుకే ప్రజలు ఆయనను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మీ, రషద్, వహాబ్, గయాస్, హర్ష, విజయ్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జిల్లాలో నిర్వహిస్తున్న నెలవారీ తనిఖీలలో భాగంగా కలెక్టర్ ప్రతిమా సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం ఈవీఎం గోదాంను పరిశీలించారు. గోదాంలో భద్రపరచిన ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాద నివారణ చర్యలు, డబుల్ లాక్ సిస్టమ్ వంటి అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. గోదాం వద్ద నియమించిన భద్రతా సిబ్బంది విధుల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటానికి ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉద్రిక్తత

- కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన, భారీగా మోహరించిన పోలీసులు

**ముద్ర ప్రతినిధి (గజ్వేల్), సిద్ధిపేట :**



మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సిద్ధిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను తీసుకుని గజ్వేల్ క్యాంప్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. ముఖ్యమంత్రి ఫొటోను ఏర్పాటు చేసి 'జై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో క్యాంప్ కార్యాలయంపై కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఫర్నీచర్, కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. కాంగ్రెస్ కార్యకర్తలే దాడి చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించగా, తాము కేవలం సీఎం ఫొటోను మాత్రమే పెట్టామని, ఎలాంటి దాడి చేయలేదని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు.

**ప్రజాస్వామ్యంపై దాడి : హరీశ్ రావు**

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడిని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ గూండాలు చేసిన దాడి అని ఆరోపించారు. ప్రజా ప్రతినిధుల క్యాంప్ కార్యాలయంపైనే ఇలాంటి దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా? అని ప్రశ్నించారు.

# ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశాలు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) నియామకం చేపట్టాలని, ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రతినిధులను నియమించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులు, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీ (డీఎస్ఈ) అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. బీఎల్ఓలకు ఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు, ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి తెలిపారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లకు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేయాలని ప్రధాన రాజకీయ పార్టీలకు సూచించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించి ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ప్రతి అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వద్ద ఐటీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ఈఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయ లక్ష్మి, సంగారెడ్డి తహసీల్దార్ జయరాం, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ పాండు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



ఏప్రిల్/మే 2026లో నిర్వహించనున్న ఎస్ఎస్సి మరియు ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ (టీఓఎస్ఎస్) పబ్లిక్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ పాండు ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం ఆయన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, మెడికల్ కిట్ వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ బృందాల నియామకం, పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణపై సంబంధిత శాఖలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు అనుమతించకూడదని ఆదేశించారు. ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ (టీఓఎస్ఎస్) పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 27 వరకు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రతిరోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని, ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించబడతాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, అందులో ఎస్ఎస్సి పరీక్షలకు 10 కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలకు 18 కేంద్రాలు ఉన్నట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. ఎస్ఎస్సి పరీక్షలకు 2,692 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ పరీక్షలకు 5,065 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో విద్య, పోలీస్, పోస్టల్, టీజీఎస్ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, ట్రాన్స్‌కో, ఆర్డబ్ల్యూఎస్, ఇంటర్మీడియట్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ 36వ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ శనివారం ఆవిష్కరించారు. అంతకుముందు ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, కౌన్సిలర్లు దొంతి లక్ష్మి, రాజమణి, మాయ గంగమణి, ఆలయ అధ్యక్షుడు కంచి మధుసూదన్, కమిటీ సభ్యులు నాగరాజు, కాశీనాథ్, నాయకులు దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 05.04.2026
www.mudranews.in | @mudranews



కరెంట్ బిల్లు:
కర్టెన్స్ లేదా బ్లైండ్స్ వాడండి
సూర్యరశ్మి నేరుగా లోపలికి రాకుండా అడ్డు కుంటాయి. గది సహజం గానే చల్లగా ఉంటుంది.


# బీఆర్ఎస్ ఖాతాలో ఆ రెండు పురాలు..

- పూర్తయిన ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి చైర్మన్ ఎన్నిక
- క్యాతనపల్లి వైస్ చైర్మన్ గా సీపీఐ కౌన్సిలర్
- పోలీసు పహారాలో జరిగిన ఎన్నికలు
- ఉదయం నుంచి కొనసాగిన హైడ్రామా




**ముద్ర, తెలంగాణ బ్యూరో:** దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ల ఎన్నికపై ఉత్కంఠకు తెరపడింది. హైడ్రామా మధ్య ఈ రెండు మున్సిపాలిటీలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి... వైస్ చైర్మన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామల ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న రాష్ట్రంలో 116మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. 13న ఫలితాలు వెలువడ్డాయి. అదే నెల16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరిగింది. అయితే పలు కారణాలతో క్యాతనపల్లి, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల ఎన్నిక వాయిదా పడింది.

మంచిర్యాల జిల్లాలో మంత్రి వివేక్ వెంకట స్వామి నియోజకవర్గం చెన్నూరులోని క్యాతనపల్లి మున్సిపల్ పీఠం బీఆర్ఎస్– సీపీఐ కూటమి వశమైంది. చైర్మన్ పదవికి శనివారం జరిగిన ఎన్నికలో బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిసల సంధ్యారాణి విజయం సాధించారు. మెజారిటీ కౌన్సిలర్లు ఆమెకు మద్దతు తెలిపారు. వైస్ చైర్మన్ పదవి కూడా బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ గెలుచుకుంది. ఆ పార్టీ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ కలిసి బీఆర్ఎస్ గెలిచిన మున్సిపాలిటీల సంఖ్య 20కి చేరుకుంది.క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం బీఆర్ఎస్, సీపీఐ కూటమి – కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేశాయి. శనివారం ఎన్నిక నిర్వహించడంతో గత అనుభవాల దృష్ట్యా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. దాదాపు 650 మంది పోలీసులను మోహరించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎన్ఎస్ 163యాక్ట్ అమ లుల్లో ఉంది. మున్సిపల్ ఆఫీసుకు వెళ్లే దారుల్లో బారికేడ్లు ఉంచారు.

ఇబ్రహీంపట్నంలో 24 వార్డులుండగా.. బీఆర్ఎస్ 13 గెల్చుకున్నది. ఓ ఇండిపెండెంట్, బీజేపీ కౌన్సిలర్ బీఆర్ ఎస్‌కు మద్దతు ప్రకటించడంతో బలం 15 కు చేరింది. క్యాతనపల్లిలోని 22 వార్డు లకు గానూ బీఆర్ఎస్ 10, సీపీఐ 4 వార్డు లు గెలిచాయి. బీఆర్ఎస్–సీపీఐ కూటమికి ఆధిక్యం ఉంది. కాంగ్రెస్ ఏడు స్థానాల్లోనే గెలిచింది. ఖానాపూర్ లో 12 వార్డులకు బీ ఆర్ఎస్, బీజేపీ చెరో నాలుగు, కాంగ్రెస్ 3, ఇండిపెండెంట్ ఒక వార్డులో గెలిపొందారు.

## ఖానాపూర్ లో ఉద్రిక్తత

- రణరంగంగా మున్సిపల్ చైర్మన్ ఎన్నిక
- ఎన్నిక ప్రక్రియ వాయిదా



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ శనివారం జరగాల్సి ఉండగా ఉద్రిక్త పరిస్థితుల మధ్య వాయిదా పడింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు అధికారులను బెదిరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని బీఆర్ ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ధ్వజమెత్తారు. వివరాలిలా ఉన్నాయి. గతంలో వాయిదా పడ్డ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో భాగంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో శనివారం ఎన్నిక నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు 8 మంది ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. నిబంధనల ప్రకారం అక్షర క్రమంలో అంకం మౌనిక నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ కు చెందిన ముగ్గురు, బీజేపీకి చెందిన నలుగురు సభ్యులు చేతులెత్తారు. దీంతో ఎన్నిక అయిపోయిందంటూ బయట ప్రచారం మొదలైంది. అయితే ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు మాత్రం అధికారులు స్పష్టమైన నిబంధనలు తెలపకుండా ఎన్నిక నిర్వహించారని, ఈ ఎన్నిక వాయిదా వేయాలని కోరారు. దీంతో ఎన్నిక ఈ నెల 5కు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నిక వాయిదా విషయం తెలియడంతో బీజేపీ, బీఆర్ ఎస్ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున మోహరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. పోలీసు జులం నశించాలంటూ అధికారుల తీరును విమర్శించారు. ఎన్నిక పూర్తయిందని, బీజేపీ అభ్యర్థిని చైర్మన్ గా ప్రకటించాలని బీఆర్ఎస్ అసెంబ్లీ ఇంచార్జి జాన్సన్ నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ధర్నా నిర్వహించారు. ఈ దశలో బీజేపీ కౌన్సిలర్ సత్యవతి కళ్లు తిరిగి పడిపోగా, 108 లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

### భారీ బందోబస్తు..

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నిర్మల్ ఏఎస్పీ సాయికిరణ్ తో పాటు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, సీఐ అజయ్ కుమార్ ల ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసులు మోహరించారు. ఎ న్నిక వాయిదా విషయం తెలియగానే ఉద్రిక్త పరిస్థితిని సరిదిద్దేందుకు శ్రమించారు.

## ప్రాణ రక్షణలో ట్రామా మెడిసిన్ పాత్ర కీలకం

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో ట్రామా మెడిసిన్ కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడిందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. శనివారం గచ్చిబౌలిలోని మెడికోవర్ హాస్పిటల్ లోని బ్లూ ప్లానెట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ట్రామా అండ్ కాన్ఫ్లిక్ట్ మెడిసిన్' (సొసైటీ ఆఫ్ అక్యూట్ కేర్, ట్రామా & ఎమర్జెన్సీ మెడిసిన్) ఫౌండేషన్, మెడికవర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రాణాపాయ పరిస్థితుల్లో వైద్యుల సత్వర నిర్ణయాలు, సాంకేతిక నైపుణ్యాలు ప్రాణాలను రక్షించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అలాంటి సందర్భాల్లో వైద్యుల అంకితభావమే అత్యంత శక్తివంతమైన సాధనమని అన్నారు. హైదరాబాద్ నగరం సమాచార సాంకేతిక రంగంతో పాటు, అందుబాటు ధరల్లో సూపర్–స్పెషాలిటీ వైద్య సేవలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని గవర్నర్ తెలిపారు. గచ్చిబౌలిలో నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సు వైద్య రంగానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ట్రామా, కాన్ఫ్లిక్ట్ మెడిసిన్ రంగాల్లో నిపుణులను తీర్చిదిద్దడం, క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. భారత దేశం, విదేశాల నుండి నిపుణులు హాజరవడం సంతోషకరమని చెప్పారు., ఈ జ్ఞాన మార్పిడి దేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో కొత్త ఆవిష్కరణలకు దారి తీస్తుందని తెలిపారు. యువ వైద్యులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తూ, తమను కేవలం వైద్యులుగా మాత్రమే కాకుండా సమాజ రక్షకులుగా భావించుకోవాలని సూచించారు. వైద్యుల బాధ్యత చికిత్సకే పరిమితం కాకుండా, సురక్షితమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కూడా విస్తరించాలన్నారు. వైద్యుల సున్నితత్వం, సేవాభావమే ఆరోగ్య వ్యవస్థకు నిజమైన బలం అని పేర్కొన్నారు. చివరగా, మెడికవర్ హాస్పిటల్స్ బృందాన్ని అభినందించారు. ఈ జాతీయ సద స్సు వైద్య రంగానికి నూతన దిశను, శక్తిని అందిస్తుందన్నారు. గవర్నర్ ప్రత్యే క ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్ పాల్గొన్నారు.

## ఎన్నికల హామీల అమలులో ఎల్ డీ ఎఫ్ వైఫల్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ముద్ర న్యూస్, కేరళ:** గత ఎన్నికల ముందు లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్ డీ ఎఫ్) ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. కేరళ రాష్ట్రంలో మార్పు, సంక్షేమం కోసం, సుపరిపాలన, సెక్యులర్ పాలన కోసం ఈ నెల 9న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ (యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్) బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన కేరళ రాష్ట్రంలోని పతనం తిట్ట అసెంబ్లీ నియోజకవర్గం తో పాటు పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేరళలో పరిపాలన దారుణంగా పడిపోయిందని ఆరోపించారు. శబరిమల ఆలయంలో కుంభకోణం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందన్న ఆయన కేరళ యువత పొట్ట చేత పట్టుకొని ప్రపంచం నలుమూలలకు వలస పోతున్నారని చెప్పారు. ఇక్కడున్న ప్రభుత్వం కనీసం సీనియర్ సిటిజన్స్ కు సరైన సంక్షేమం, ఆదరణ లేకుండా పోయిందన్నారు. కేరళ అంటే సెక్యులరిజం, ఉన్నత విద్యావంతులు, గొప్ప మానవీయ కోణం ఉంటుందని అంతా భావిస్తాం. కానీ నేడు కేరళలో ఆ తరహా పరిస్థితులు కనిపించకుండా పోయాయని విమర్శించారు. కేరళ అంటే కమ్యూనిజం, మార్క్సిజం గురించి మాట్లాడుతారు కానీ అది నేడు పక్కకు పోయి గుండాయిజం మాత్రమే కనిపి స్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వాదులు శాంతి కాముకులు, సుపరిపాలన, సెక్యులరిజాన్ని కోరుకుంటారని వివరించారు. తెలంగాణలో ఎన్నికలకు ముందు మేము ఇచ్చిన హామీలలో దాదాపు అన్నింటిని అణలు చేశామని భట్టి అన్నారు. మా హామీల అమలుపై ఎవరికైనా అనుమానం ఉంటే తెలంగాణకు వచ్చి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఆర్థిక మంత్రిగా లెక్కలతో సహా అన్ని వివరిస్తానని అన్నారు. తెలంగాణ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఇప్పటివరకు తెలంగాణ మహిళలు 10వేల కోట్ల ఉచిత ప్రయాణాలు చేసిన వారి తరఫున రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తుందని భట్టి చెప్పారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు, రూ.500 కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

### వారికోసం ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ..

కేరళలో యూడీఎఫ్ కూటమిని అధికారంలోకి వస్తే కాలేజీలకు వెళ్లే మహిళలకు నెలకు రూ.1000 చొప్పున అందజేస్తామని భట్టి హామీ ఇచ్చారు., స్వయం ఉపాధి కోసం యువతకు వడ్డీ లేకుండా రూ.ఐదు లక్షల వరకు ఆర్థిక సహాయం అందజే స్తామన్నారు. సామాజిక పెన్షన్‌ను రెండు వేల నుంచి మూడు వేలకు పెంపు, ఉమెన్ చాందీ పేరిట వృద్ధుల కోసం 25 లక్షల బీమా పథకాన్ని తీసుకురాబోతున్నామని చెప్పారు. యూడీఎఫ్ అధికారంలోకి రాగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి వారి సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఆ 'పురాల' కైవసం స్ఫూర్తిదాయకం

- క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాలను బీఆర్ఎస్ కైవసంపై కేటీఆర్ హర్షం



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఎంతో హర్షణీయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకోసం శక్తివంచన లేకుండా కృషి చేసిన మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్‌కు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. అడ్డదారుల్లో వీటిని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్ని రకాల ప్రలోభాలు పెట్టినా, రకరకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా వేటికీ లొంగకుండా మొక్కవోని దీక్షతో ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్లకు కేటీఆర్ సెల్యూట్ చేశారు.

### కామ్రేడ్ల పోరాట పటిమ స్ఫూర్తిదాయకం..

క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు మిత్రపక్షమైన సీపీఐ కామ్రేడ్లు అడుగడుగునా కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమని కేటీఆర్ చెప్పారు. అణచివేతకు, బెదిరింపులకు, అవినీతి అక్రమాలకు, అప్రజాస్వామిక చర్యలకు తెలంగాణలో తావులేదని ఈ తీర్పు తేల్చిచెప్పిందని వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్లలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్ డౌన్ మొదలైందని ఈ ఫలితాలు నలుదిశలా చాటి చెప్పాయన్నారు. అటు పంచాయతీ, ఇటు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పట్టించిన గులాబీ జెండా సైనికులను పార్టీ ఎప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. ఈ విజయాలు అందించిన స్ఫూర్తిని కొనసాగిద్దామని. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అడుగడుగునా విధ్వంసం చేస్తున్న రేవంత్ సర్కారుకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.

## పాక్‌పై దాడికి భారత్ రె'ఢీ'

- పాక్‌లో సంక్షోభం తీవ్రం...భారత్ వ్యూహాత్మక అడుగులపై చర్చలు
- రాజ్‌నాథ్ భేటీలు, మాక్ డ్రిల్స్‌తో పెరిగిన ఉద్రిక్తతలు
- యుద్ధ సంకేతాలా? లేక ముందస్తు భద్రతా చర్యలా?



**ముద్ర డెస్క్:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పాకిస్థాన్‌లో ఆర్థిక పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. పెట్రోల్ ధరల పెరుగుదల, విదేశీ మారక నిల్వల కొరత, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు ఆ దేశాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో భారత్ ఈ పరిస్థితిని వ్యూహాత్మకంగా వినియోగించుకుంటుందా అనే చర్చలు రాజకీయ, భద్రతా వర్గాల్లో వేడెక్కుతున్నాయి.ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాధిపతులతో వరుస భేటీలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ భద్రతా పరిస్థితులు, సరిహద్దు పరిణామాలపై సమీక్షలు జరిగినట్లు సమాచారం. అదే సమయంలో పాకిస్థాన్‌కు కఠిన హెచ్చరికలు జారీ చేయడం కూడా ఉద్రిక్తతలకు దారి తీస్తోంది.ఇంకా రాష్ట్రాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించడం, అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని అధికారుల సూచనలు ఇవ్వడం గమనార్హం. కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు ముందస్తుగా మూడు నెలల రేషన్ సరఫరా చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ చర్యలు యుద్ధానికి సంకేతాలా? లేక ముందస్తు జాగ్రత్తలేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అయితే భారత్ ప్రభుత్వం నుంచి యుద్ధంపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. భద్రతా పరమైన ముందస్తు చర్యలు తీసుకోవడం సాధారణమని నిపుణులు చెబుతున్నారు. మొత్తం మీద పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ, యుద్ధం తప్పనిసరి అన్న స్పష్టత ఇంకా కనిపించడం లేదు.

## 'ప్రైవేట్' దోపిడీ పై సీఎం మౌనమేలా?

- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆగం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద ఈ ప్రభుత్వానికి అంత ప్రేమెందుకని నిలదీశారు. మహిళా బిల్లు కోసం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలునిర్వహించినప్పుడు లక్షలాది మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం చేసేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఎందుకు నిర్వహించటం లేదని ప్రశ్నించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. దీనిపై తెలంగాణ విద్యా కమిషన్ ముసాయిదా బిల్లు సిద్ధం చేసి నెలలు గడుస్తున్నా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు.

### కార్పొరేట్ విద్యా సంస్థలతో లాలూచీ..

ముసాయిదా బిల్లు సిద్ధమైన తర్వాత కూడా భారీ ఎత్తున కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు పెంచాయని కవిత గుర్తు చేశారు. సామాన్య ప్రజలు ఫీజులు చెల్లించలేక ఆగమవుతుంటే ప్రభుత్వం మాత్రం ఈ బిల్లును అటకెక్కించిందని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యా సంస్థల లాబీతో ప్రభుత్వానికి లాలూచీ ఏంటనీ ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### నేడు సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం..

సింగరేణి సంస్థను కాపాడేందుకు తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో కవిత, హెచ్ఎంఎస్ ప్రధాన కార్య దర్శి రియాజ్ అహ్మద్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణ, సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు, అలియాస్ పేర్ల అంశం, కారుణ్య నియమాకాలు, సంస్థ మనుగడ కోసం చేపట్టాల్సిన చర్యలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
05.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కరెంట్ బిల్లు : ఇన్వర్టర్ లేదా స్టార్ రేటింగ్ పరికరాలు వాడండి**
5 స్టార్ రేటింగ్ ఉన్న పరికరాలు తక్కువ కరెంట్ వినియోగిస్తాయి.
దీర్ఘకాలంలో మంచి సేవింగ్ ఇస్తాయి.



## క్రీడలకు అధిక ప్రాధాన్యత

- రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ముద్ర, కాప్రా:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఓం శక్తి గ్రూప్ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ లో నిర్వహించిన ఫైర్ ర్యాలీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుకు రావాలని, ముఖ్యంగా బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. క్రీడా వసతులు మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బైరీ అధ్యక్షుడు నవీన్ గౌడ్ , మాధవి స్థానిక నాయకులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఫార్మా పరిశ్రమ బలోపేతమే లక్ష్యం

- హైదరాబాద్‌లో చింతన్ శివిర్

**ముద్ర, హైదరాబాద్ :**
దేశంలో ఫార్మా పరిశ్రమను బలోపేతం చేయడమే లక్ష్యం అని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అన్నారు. హైదరాబాద్‌లో కేంద్ర వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో, ఫార్మెక్సిల్ సహకారంతో నిర్వహించిన 'చింతన్ శివిర్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత ఫార్మా రంగం ప్రపంచంలో వేగంగా ఎదుగుతోందని, ప్రస్తుతం సుమారు 60 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఈ రంగంలో దాదాపు సగం ఆదాయం ఎగుమతుల ద్వారానే వస్తోందని చెప్పారు. తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాలను అందించడం ద్వారా భారత్ 'ప్రపంచపు ఫార్మసీ'గా గుర్తింపు పొందిందన్నారు. అలాగే స్వయం సమృద్ధి సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా ఏపీఐలు, బల్క్ డ్రగ్స్ వంటి కీలక అంశాల్లో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. బయోలాజిక్స్, బయోసిమిలర్స్ వంటి కొత్త రంగాల్లో ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

### లక్ష్యాల మేరకు రాజధాని
## పనులు పూర్తి చేయాలి

- ఐకానిక్ ముద్ర కనిపించాలి
- నిర్మాణ సంస్థలు కడుతోంది రాజధాని
- -అమరావతి రాజధాని పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**ముద్ర, అమరావతి:-**
అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రధాని ప్రారంభోత్సవ చేసే రాజధానిని నిర్దేశించుకున్న సమయానికి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు ఉండగా, వాటిలో రూ. 50, 943 కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు వివరించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌలిక సదుపాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని తెలిపారు. రాజధాని పనుల్లో వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని పనులు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే వర్షా కాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది కాబట్టి ఆలోపే చే పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని, ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే అని అన్నారు. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలన్నారు. సమీక్ష సందర్భంగా ఇటీవల రాజధాని ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటన ప్రస్తావనకు వచ్చింది. ప్రతీ అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కర్ణాటక సంస్కృతి, సంప్రదాయం గొప్పది

- సైనికుల ప్రాణత్యాగాలు ఎప్పటికీ మర్చిపోకూడదు
- చంద్రబాబును అక్రమంగా నిర్బంధించినప్పుడు అండగా నిలిచారు
- మా కుటుంబం మీకు రుణపడి ఉంటుంది
- రాష్ట్రాల మధ్య పోటీ ఉంటేనే కసి ఉంటుంది
- కుమార స్వామివిశాఖ ఉక్కును కాపాడారు
- సింధనూరులో శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్



**ముద్ర, సింధనూరు(కర్ణాటక):**
టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు, ఇక్కడున్న తెలుగు వారు అండగా నిలిచారని, తమ కుటుంబం జీవితాంతం వీరికి రుణపడి ఉంటుందని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరు హోసళ్లీ క్యాంప్ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ దేవరాయ సైనిక్ స్కూల్ ను కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఎల్లారిగు నమస్కారా. నిమ్మ ప్రీతిగే ధన్యవాదగలు అంటూ కన్నడలో ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, కర్ణాటక పవిత్ర భూమి, సంస్కృతి, సంప్రదాయం గొప్పది. కన్నడ, తెలుగు తుంబా సేమ్. నమ్మ సంస్కృతి కూడా సేమ్. ఆంధ్రా, కర్ణాటక అన్నా తమ్మన తారా అన్నారు. సరిహద్దుల్లోని సైనికులు. సైనికుల ప్రాణత్యాగాలు ఎప్పుడూ మర్చిపోవద్దన్నారు. ఉగ్రవాదులు పెహల్గాంపై దాడి అనంతరం జరిగిన పోరాటంలో అనంతపురం జిల్లా పుట్టపర్తికి చెందిన మురళీ నాయక్ అనే ఒక జవాన్ చనిపోయాడు. తల్లి దండ్రులకు ఒక్కడే కొడుకు కావడంతో ఆర్మీకి వెళ్తాను అంటే వారు ఒప్పుకోలేదు. తాను దేశం కోసం చనిపోతే దేశం మొత్తం మీకు అండగా ఉంటుంది అని మురళీ తన తల్లిదండ్రులకు చెప్పింది నిజమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో విలువల ఆధారిత విద్యా బోధన మొదలు పెట్టామని, చాగంటిని కేబినెట్ ర్యాంక్ ఇచ్చి అడ్వైజర్ గా నియమించుకున్నామని అన్నారు. తాను మంగళగిరి నియోజకవర్గంలో 2019లో పోటీచేసి ఓడిపోయి, ఆ తర్వాత ఐదేళ్లు కష్టపడ్డానని, 2024 ఎన్నికల్లో 91వేల ఓట్ల మెజార్టీతో గెలిచానని తెలిపారు. సింధనూరు ఎడ్యుకేషన్. ఆటోమొబైల్, రైస్ ప్రొడక్షన్, హయ్యస్ట్ ట్యాక్స్ పేయింగ్ లో నెం.1 అని ఆ రికార్డ్స్ ఎవరూ బ్రేక్ చేయలేరని అన్నారు. అలాగే శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ కూడా నెం.1 కావాలని కోరుకుంటున్నానని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య పోటీ ఉంటేనే అభివృద్ధి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో పాటు విశాఖ ఎంపీ శ్రీ భరత్, కర్ణాటక వైద్య విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్, కర్ణాటక కన్నడ, సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ ఎస్. తంగడగి, కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్ బోసురాజు, కొప్పళ మాజీ ఎంపీ కే.విరూపాక్షప్ప, కర్ణాటక మాజీ మంత్రి, కేవోఎఫ్(బెంగళూరు) ప్రెసిడెంట్ వెంకటరావు నాడగౌడ, కర్ణాటక మాజీ ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లీ, కొప్పళ ఎంపీ కే.రాజశేఖర్ బసవరాజ్ హిట్నాల్, రాయచూర్ ఎంపీ జి.కుమార్ నాయక్, సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లీ, ఎమ్మెల్సీ బసవగౌడ బాదర్లీ, అమృత కన్ స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్(బెంగళూరు) వ్యవస్థాపకులు పీవీ రావు, శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ బి.వెంకటరావు, డైరెక్టర్లు, సింధనూరు స్థానిక తెలుగు ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సింగరేణిలో సహజ మరణానికీ రూ.10 లక్షల ఉచిత బీమా

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




సింగరేణిలో సహజ మరణం చెందిన కార్మికులకు ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాలని యూనియన్ బ్యాంక్ నిర్ణయించింది. ఇప్పటివరకు రూ. కోటి ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్న ఈ బ్యాంక్ సింగరేణి యాజమాన్యం చేసిన సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. యూనియన్ బ్యాంకులో కార్పొరేట్ శాలరీ అకౌంటు కలిగి ఉన్న కార్మికులు, అధికారులు ఎవరైనా సరే మృతి చెందితే వారికి రూ. పది లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని వర్తింప జేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్సు గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవ ఫలితంగా బ్యాంకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి వచ్చింది.

## ప్రాణరక్షణలో ట్రామా మెడిసిన్ పాత్ర కీలకం

- రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా

**ముద్ర, హైదరాబాద్:**
పెరుగుతున్న ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో ట్రామా మెడిసిన్ కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడిందని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. శనివారం గచ్చిబౌలిలోని మెడికోవర్ హాస్పిటల్ లోని బ్లూ ప్లానెట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ట్రామా & కాన్ఫ్లిక్ట్ మెడిసిన్' పై సాక్టెమ్ (సొసైటీ ఆఫ్ అక్యూట్ కేర్, ట్రామా అండ్ ఎమర్జెన్సీ మెడిసిన్) ఫౌండేషన్, మెడికవర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో వైద్యుల సత్వర నిర్ణయాలు, సాంకేతిక నైపుణ్యాలు ప్రాణాలను రక్షించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. అలాంటి సందర్భాల్లో వైద్యుల అంకితభావమే అత్యంత శక్తివంతమైన సాధనమని అన్నారు. హైదరాబాద్ నగరం సమాచార సాంకేతిక రంగంతో పాటు, అందుబాటు ధరల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ జాతీయ సదస్సు వైద్య రంగానికి ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ట్రామా, కాన్ఫ్లిక్ట్ మెడిసిన్ రంగాల్లో నిపుణులను తీర్చిదిద్దడం, క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, సాక్టెమ్, మెడికవర్ ప్రతినిధులు పాల్గొన్నారు.
ఇతర రాష్ట్రాల ఓటర్లకు ప్రత్యేక సెలవులు

## ఇతర రాష్ట్రాల ఓటర్లకు ప్రత్యేక సెలవులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు, ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ఈ ప్రత్యేక సెలవులు ప్రకటించింది. ఈ మేరకు కార్మిక , ఉపాధి శాఖ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది. ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు పోలింగ్ రోజు 'పెయిడ్ హాలిడే' ఇవ్వాలని స్పష్టం చేసింది. అసోం, కేరళ, పుదుచ్చేరి

# గులాబీ తోటలోకి 'జీవన'ం..

- 42 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి స్వస్తి...
- సంజయ్ ఎఫెక్ట్... కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌వైపు అడుగులు
- జగిత్యాల రాజకీయాల్లో భారీ మార్పు...
- తిట్టిన పార్టీతోనే పొగిడించుకోనున్న మాజీ మంత్రి!





**ముద్ర , కరీంనగర్ :**
తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌కు వెన్నెముకలా నిలిచిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. 42 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి ఇటీవలే స్వస్తి పలికిన రాజకీయ కురువృద్ధుడు ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యాడు. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి అనే రీతిలో రాజకీయం సాగింది. కానీ గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు, అవమానాలు ఆయనను తీవ్రంగా కలిచివేశాయి. దీంతో పార్టీకి గుడ్‌బైయ్ చెప్పాడు.

**సంజయ్‌కుమార్ ఫిరాయింపుతో..**
బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి నిర్ణయానికి ప్రధాన కారణమైంది. ఎన్నికల్లో జీవన్‌రెడ్డి ఓటమి పాలవగా, సంజయ్‌కుమార్ గెలిచారు. అనూహ్యంగా సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం, పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్‌రెడ్డికి మింగుడుపడలేదు. దీంతో కీలక నిర్ణయం తీసుకుని, గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో ఇంతకాలం తిట్టిన గులాబీ పార్టీ నేతలతోనే త్వరలో పొగిడించుకోబోతున్నారు.

**జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ ప్లీనరీ..**
జీవన్‌రెడ్డి చేరిక తర్వాత జగిత్యాల వేదికగానే బీఆర్ఎస్ ప్లీనరీ నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 27న జగిత్యాల సమీపంలోని వ్యవసాయ భూముల్లో భారీ ఎత్తున ఈ సమావేశం నిర్వహించే యోచనలో అధిష్టానం ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న తర్వాత స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్లీనరీ సభ వేదిక మీదుగానే కేసీఆర్ జీవన్‌రెడ్డికి అప్పగించే బాధ్యతలను ప్రకటించనున్నారు. జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తున్న నేపథ్యంలో బలమైన సంకేతాలను పంపించేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాపై ప్రభావం..**
జీవన్‌రెడ్డి చేరికతో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు బలమైన నేతను కోల్పోయినట్లైంది. బీఆర్ఎస్‌కు మాత్రం బలం చేకూరనుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం పార్టీ అధిష్టానం పట్ల జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. కార్యకర్తలతో సుదీర్ఘ మంతనాల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు.

**జీవన్‌రెడ్డికి కీలక పదవి..**
జీవన్‌రెడ్డి చేరికతోపాటు, ఆయనకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వవచ్చని తెలుస్తోంది. కేసీఆర్ హామీతోనే జీవన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జీవన్‌రెడ్డి చేరిక తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కానుంది. కాంగ్రెస్‌లోని ఇతర అసంతృప్త నేతలు కూడా బీఆర్ఎస్‌వైపు చూసే అవకాశం ఉంది. జగిత్యాల ప్లీనరీ ద్వారా బీఆర్ఎస్ తన బలాన్ని చాటుకోవాలని భావిస్తోంది.
42 ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి తెరదించి, గులాబీ గూటికి చేరుతున్న జీవన్‌రెడ్డి నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపింది. జగిత్యాల వేదికగా జరగనున్న ప్లీనరీ ఈ మార్పుకు సాక్ష్యం నిలవనుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
05.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కరెంట్ బిల్లు : స్టాండ్బై మోడ్‌లో పరికరాలు ఆఫ్ చేయండి**

టీవీ, చార్జర్లు స్టాండ్బైలో ఉన్నా కరెంట్ తీసుకుంటాయి. ప్లగ్ తీసేస్తే అదనపు ఖర్చు తగ్గుతుంది.





## ముంబైకి షాక్ ఇచ్చిన ఢిల్లీ

- **అక్షర్ సేన అదిరిపోయిన గెలుపు**
- **ఐపీఎల్ లో సంచలనం**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఢిల్లీ జట్టుతో మ్యాచ్ ప్రారంభానికి ముందు అందరి అంచనాలు దాదాపు ఒకేవిధంగా ఉన్నాయి. కచ్చితంగా ముంబై గెలుస్తుందని.. ఢిల్లీ దారుణమైన ఓటమిని మూట కట్టుకుంటుందని.. కామెంట్రీ చేసే వాళ్ళు కూడా చెప్పేశారు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు తక్కువలో తక్కువ 250 పరుగులు చేస్తుందని ఒక అంచనాకొచ్చారు.

అందరి అంచనాలకు తగ్గట్టుగానే ముంబై ఓపెనర్లు రోహిత్ శర్మ.. రికెల్టన్ తొలి 3 ఓవర్లలో బౌండరీలతో విరుచుకుపడ్డారు. దీంతో 250 ప్లస్ స్కోర్ సాధ్యమవుతుందని ముంబై అభిమానులు భావించారు. అదిగో ఆ తర్వాత మ్యాజిక్ మొదలైంది. ముఖేష్ తన ఓవర్లో రికెల్టన్.. తిలక్ వర్మ వికెట్లు పడగొట్టాడు. ఇక అప్పటినుంచి మ్యాచ్ మొత్తం ఢిల్లీ వైపు రావడం మొదలుపెట్టింది. ఏ దశలో ముంబై జట్టు ప్లేయర్లకు అవకాశం ఇవ్వకుండా ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ వ్యవహరించాడు. బౌలింగ్లో పూర్తిస్థాయిలో వైవిధ్యాన్ని ప్రదర్శించాడు. కులదీప్ యాదవ్ మినహా.. మిగతా వారంతా అద్భుతంగా బౌలింగ్ చేశారు. 250 కి మించి పరుగులు చేస్తారు అనుకుంటున్న దశ నుంచి.. 164 వరకే ఆపేశారు.

మధ్యస్థ లక్ష్యంతో రంగంలోకి దిగిన ఢిల్లీ జట్టుకు అదిరిపోయే ఆరంభం లభించలేదు. భారీగా అంచనాలు పెట్టుకున్న కేఎల్ రాహుల్ మరోసారి విఫలమయ్యాడు.. నితిష్ రాణా సున్నా చుట్టాడు.. నిస్సాంక(44), సమీర్ రిజ్వీ (90) దూకుడుగా బ్యాటింగ్ చేశారు. అప్పటికే ఢిల్లీ విజయం ఖాయమైంది. చివర్లో మిల్లర్(21*), స్టబ్స్(3*) అదరగొట్టడంతో 18.1 ఓవర్లలో ఢిల్లీ జట్టు లక్ష్యాన్ని సాధించింది. మొత్తంగా ఆరు వికెట్ల తేడాతో గెలుపును అందుకుంది. ప్రస్తుత ఐపీఎల్ లో వరుసగా రెండో విజయం సాధించి ఢిల్లీ జట్టు తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. ఢిల్లీ జట్టులో కెప్టెన్ అక్షర్ బౌలింగ్లో సరికొత్త ప్రయోగాలు చేశాడు. యువ బౌలర్లను ఎక్కువగా వాడుకున్నాడు. మైదానం గురించి అతనికి సంపూర్ణమైన అవగాహన ఉండడంతో టాస్ గెలవగానే బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలి 3 ఓవర్లలో ముంబై ఆటగాళ్లు అదరగొట్టినప్పటికీ.. ఆ తర్వాత మ్యాచ్ స్వరూపం మొత్తం మారిపోయింది. చేజింగ్ లో కూడా ఢిల్లీ జట్టు ప్రారంభంలో ఇబ్బంది పడినప్పటికీ.. సమీర్ రిజ్వి వల్ల మరో 11 బంతులు మిగిలి ఉండగానే.. విజయాన్ని అందుకుంది.



## శ్రేయస్ అయ్యర్‌కు భారీ జరిమానా

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు రెండో విజయం. ఆ సంతోషం ఆ జట్టు ఆటగాళ్లకు లేకుండా పోయింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తోపాటు పంజాబ్ ఆటగాళ్ల పైనా జరిమానా పడింది. ఇది రెండోసారి కావడంతో శ్రేయస్‌పై రూ.24 లక్షల ఫైన్ విధించినట్లు ఐపీఎల్ కమిటీ వెల్లడించింది. ప్లేయర్లకు రూ. 6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధిస్తూ మ్యాచ్ రిఫరీ నిర్ణయం తీసుకున్నారు. “ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ రెండోసారి స్లో ఓవర్‌రేట్‌ను ఎదుర్కొంది. ఆర్టికల్ 2.22 నిబంధన ప్రకారం.. కెప్టెన్ శ్రేయస్‌పై రూ.24 లక్షలు, ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా మిగతా ఆటగాళ్లపై రూ.6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానాను మ్యాచ్ రిఫరీ విధించారు” అని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ వెల్లడించింది.

**మరోసారి జరిగితే..**

గత ఐపీఎల్ ముందువరకూ కెప్టెన్‌పై మూడుసార్లు స్లో ఓవర్ రేట్ తప్పిదాలకు పాల్పడితే ఒక మ్యాచ్ బ్యాన్ పడేది. కానీ, గత సీజన్ సమయంలో ఐపీఎల్ కొన్ని నిబంధనలను మార్చింది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం మూడోసారి తప్పిదానికి పాల్పడినా.. ఆ కెప్టెన్‌పై జరిమానా పెరుగుతూ పోతుంది. అంతేకానీ, ఎలాంటి నిషేధం ఉండదు. మళ్లీ మూడోసారి శ్రేయస్ అయ్యర్ ఇదే తప్పిదానికి పాల్పడితే ఆ జరిమానా రూ.36 లక్షలు అవుతుంది. అలాగే ప్లేయర్లపై 50 శాతం వరకూ మ్యాచ్ ఫీజులో కోత విధించే ప్రమాదం లేకపోలేదు.

### పేరు గంగూలీ కాకపోయినా..
## నేను బెంగాలీయే!

- **లియండర్ పేస్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**



టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్(Leander Paes) ఇటీవల భాజపాలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను బెంగాలీ వ్యక్తిని కాదంటూ వస్తోన్న విమర్శలపై స్పందించారు. బహిరంగ కార్యక్రమాలకు వెళ్లినప్పుడు తాను బెంగాలీనేనా అని ప్రజలు అడిగితే బాధ కలుగుతుందన్నారు. తన పేరు గంగూలీ కాకపోవచ్చు కానీ.. తాను మాత్రం బెంగాలీనేనని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ కుటుంబానికి పోర్చుగీస్ మూలాలు ఉన్నప్పటికీ తాము మాత్రం భారతీయులమేనని పేర్కొన్నారు. తాను కోల్‌కతాలో పుట్టానని.. తన టెన్నిస్ ప్రయాణం సౌత్ క్లబ్‌లో ప్రారంభమైందని లియాండర్ పేస్ తెలిపారు. లా మార్టినియర్ స్కూల్‌లో చదువుకొన్నానని.. కోల్‌కతాలోని మైదానాల్లోనే ఆడుకొన్నానని అన్నారు. ఈ నగరానికి గొప్ప క్రీడా చరిత్ర ఉందని కొనియాడారు. ప్రస్తుత బెంగాల్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించట్లేదని విమర్శించారు. గతేడాది అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ పర్యటన వేళ కోల్‌కతా సాల్ట్‌లేక్ స్టేడియంలో చోటుచేసుకొన్న గందరగోళం, నిర్వహణ లోపాలను లియాండర్ పేస్ ఎత్తిచూపారు. అప్పట్లో బెంగాల్ ప్రభుత్వం ఆ ఈవెంట్‌ను సరిగ్గా నిర్వహించనందునే అంత గందరగోళం చోటుచేసుకుందన్నారు. క్రీడా రంగానికి చెందినవారెవరైనా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఉంటే.. పరిస్థితులు భిన్నంగా ఉండేవన్నారు. కోల్‌కతాలో పుట్టిన పేస్.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టెన్నిస్‌వైపు నడిచారు. తన కెరీర్‌లో ఏకంగా 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచారు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్‌లో, 8 పురుషుల డబుల్స్‌లో నెగ్గారు. రాకెట్ వదిలి.. 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడు ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికలకు ముందు ఇటీవల భాజపాలో చేరారు. బెంగాల్‌కు రెండు దఫాలుగా ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

## బీసీసీఐ సహకారం కోరాం

- **బంగ్లా క్రికెట్ బోర్డు డైరెక్టర్**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

భారత క్రికెట్ బోర్డు సహకారం కోసం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈమేరకు బీసీసీఐకి లేఖ ద్వారా తమ ఆసక్తిని తెలియజేసింది. మొన్నటివరకూ ఇరుదేశాల మధ్య రాజకీయ వైరుధ్యంతో గత టీ20 ప్రపంచకప్‌లోనూ బంగ్లా ఆడని సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లోనూ ఆ జట్టు ప్లేయర్లను ఫ్రాంచైజీలు తప్పించాయి. ఈ క్రమంలో మళ్లీ బీసీసీఐ సహకారం కోరుతూ బీసీబీ లేఖ రాయడం గమనార్హం. తాజాగా ఆ వివరాలను బంగ్లా బోర్డు డైరెక్టర్ నజ్ముల్ అబేదిన్ వెల్లడించారు.

“మేం బీసీసీఐకి రాసిన లేఖలో ద్వైపాక్షిక సిరీస్‌ల గురించి ప్రస్తావించాం. సెప్టెంబర్‌లో టీమ్‌ఇండియా మా దేశంలో పర్యటించమని కోరాం. ఐసీసీ షెడ్యూల్ ప్రకారం భారత్‌కు మా టీమ్ వెళ్లాల్సిఉంది. బంగ్లాకు సహకారం అందించే అవకాశాలను పరిశీలించమని విజ్ఞప్తి చేశాం” అని అబేదిన్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం వచ్చాక ఇరుదేశాల మధ్య సంబంధాలు కాస్త మెరుగవుతున్నాయి. ఏప్రిల్ 7, 8 తేదీల్లో బంగ్లా విదేశాంగ మంత్రి డాక్టర్ ఖలిలుర్ రహ్మాన్ భారత పర్యటనకు రానున్నారు. ద్వైపాక్షిక సంబంధాలతోపాటు క్రికెట్ సహకారంపైనా చర్చించే అవకాశం ఉంది.






## సమీర్ రిజ్వి సునామీ!

- **ఒంటిచేత్తో ముంబైను మట్టికరిపించాడు**
- **సమీర్ రిజ్వీ ముంబై కే కాదు.. చెన్నైకీ ఈ పేరు యాదింటుంది**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

బుమ్రాకు రెస్పెక్ట్ ఇచ్చాడు. దీపక్ చాహర్ కు చుక్కలు చూపించాడు. మిచెల్ సాంట్నర్ కు పీడకలను మిగిల్చాడు. శార్దూల్ ఠాకూర్ కు వేదన కలిగించాడు. మయాండ్ మర్కండే కు నరకం అంటే ఎలా ఉంటుందో లైవ్ లో చూపించాడు. కార్బిన్ జోష్ కైతే బంతి పట్టుకోవాలంటేనే భయం కలిగేలా చేశాడు. ఇవన్నీ చేసింది కేఎల్ రాహుల్ కాదు.. నితీష్‌రానా అంతకంటే కాదు.. అతడు మరెవరో కాదు సమీర్ రిజ్వి.

చెన్నై జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న రిజ్వి.. మెగా వేలంలో చెన్నై జట్టు వదులుకోవడంతో.. ఢిల్లీ యాజమాన్యం కొనుగోలు చేసింది. బదాని నేతృత్వంలో అతడు తన బ్యాటింగ్ స్టైల్ పూర్తిగా మార్చుకున్నాడు. అందువల్లే బీభత్సంగా ఆడుతున్నాడు. గత సీజన్లో చివరి మ్యాచ్లో హాఫ్ సెంచరీ చేసిన అతడు.. ఈ సీజన్లో ఇప్పటికే వరుసగా రెండు హాఫ్ సెంచరీలు చేశాడు. ఇటీవల జరిగిన మ్యాచ్లో 47 బంతుల్లో 70 పరుగులు చేశాడు. ఇందులో ఐదు ఫోర్లు.. నాలుగు సిక్సర్లు ఉన్నాయి..

ముంబై జట్టుతో జరిగిన మ్యాచ్లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 51 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్ల సహాయంతో 90 పరుగులు చేశాడు. వాస్తవానికి అతడు సెంచరీ చేస్తాడని అనుకున్నప్పటికీ.. బాష్ బౌలింగ్లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. ఈ మ్యాచ్లో ముంబై జట్టు ముందుగా బ్యాటింగ్ చేసింది. ఢిల్లీ బౌలర్ల దూకుడు ముందు తలవంచింది.. పటిష్టమైన బ్యాటింగ్ లైన్ అప్ ఉన్నప్పటికీ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. సరే కుమార్ యాదవ్ 51, రోహిత్ శర్మ 35, నమన్ దీర్ 28 పరుగులు చేశారు. ఢిల్లీ జట్టు బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఎంగిడి, అక్షర్ పటేల్, విప్రజ్ నిగమ్, నటరాజన్ తలా ఒక వికెట్ సాధించారు. ముంబై జట్టు విధించిన 163 పరుగుల లక్ష్యాన్ని సాధించడానికి రంగంలోకి దిగిన ఢిల్లీ జట్టుకు అదిరిపోయే ఆరంభం లభించలేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్ కేవలం ఒకే పరుగు చేశాడు. దీపక్ బౌలింగ్ లో అవుట్ అయ్యాడు. నిస్సాంక 44 పరుగులు చేశాడు. నితీష్ రన్ అవుట్ అయ్యాడు. ఈ దశలో వచ్చిన సమీర్, మిల్లర్ దూకుడుగా బ్యాటింగ్ చేశారు. వీరిద్దరూ ఏకంగా నాలుగో వికెట్ కు 76 పరుగులు జోడించారు. అంతకుముందు సమీర్ రిజ్వి, నిస్సాంక మూడో వికెట్ కు 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

ఒకానొక దశలో 73 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న ఢిల్లీ జట్టును రిజ్వి కాపాడాడు. వన్ మ్యాన్ షో తో అదరగొట్టాడు. ఢిల్లీ మైదానం నలుమూలల బంతిని పరుగులు పెట్టించాడు. సిక్సర్లతో.. ఫోర్ లతో హోరెత్తించాడు. రిజ్వి ప్రమాదకరమైన ఆటగాడు అయినప్పటికీ చెన్నై జట్టు వదులుకుంది. ఢిల్లీ అతడిని అందిపుచ్చుకుంది. ఇప్పుడేమో అతడు జట్టుకు ఆపద్బాంధవుడు అయ్యాడు. ముంబై జట్టు తన పేరును ఎప్పటికీ గుర్తుంచుకునే విధంగా చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు.

### మేఘాంశ్ శ్రీహరి హీరోగా 'ఆస్మాన్'
## చిత్రం ఘనంగా ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్:**

యువ హీరో మేఘాంశ్ శ్రీహరి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఆస్మాన్' పూజా కార్యక్రమాలతో శనివారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీ క్లీంకార సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై కొండారు వెంకటేష్, శ్రీకాంత్ మన్నెం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామ్ నందన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సాయి దుర్గ తేజ్, సందీప్ కిషన్, విశ్వక్ సేన్, నిహారిక కొణిదెల, రోషన్ కనకాల, తిరువీర్, నార్నే నితిన్, రామ్ తాళ్లూరి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి సాయి దుర్గ తేజ్ క్లాప్ కొట్టగా, సందీప్ కిషన్ స్విచ్ ఆన్ చేశారు. నిహారిక కొణిదెల స్క్రిప్ట్‌ను అందించారు.

ఈ సందర్భంగా హీరో మేఘాంశ్ శ్రీహరి మాట్లాడుతూ, ఈ సినిమా మంచి కథతో వస్తోందని, ప్రేక్షకులను అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దర్శకుడు రామ్ నందన్ మాట్లాడుతూ, ఇది తనకు తెలుగులో తొలి సినిమా అని, సస్పెన్స్ థ్రిల్లర్‌గా వినూత్నంగా రూపొందిస్తామని తెలిపారు.

నిర్మాతలు శ్రీకాంత్ మన్నెం, వెంకటేష్ కొండారు మాట్లాడుతూ, ఈ చిత్రం తమ బ్యానర్‌లో మొదటి ప్రాజెక్ట్ కావడంతో ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నామని తెలిపారు. మూడు షెడ్యూల్స్‌లో చిత్రాన్ని పూర్తి చేసి, మే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరగనుంది.






### 'బిచ్చగాడు' కాంబో రిపీట్..
## వంద దేవుళ్ళు

**ముద్ర సినిమా డెస్క్ :**

'బిచ్చగాడు'తో ఒక బ్లాక్‌బస్టర్‌ను సొంతం చేసుకున్నారు హీరో విజయ్ ఆంటోనీ, దర్శకుడు శశి. సుమారు పదేళ్ల తర్వాత వీరి కాంబోలో రూపొందుతున్న చిత్రం 'వంద దేవుళ్ళు'. స్వాసిక కథానాయిక. తాజాగా ఈ సినిమా టీజర్ విడుదలైంది. యథార్థ సంఘటన ఆధారంగా ఇది తెరకెక్కుతోందని టీజర్ ప్రారంభంలో టీమ్ తెలిపింది. ఓ మారుమూల గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనగా దీనిని చూపించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 05.04.2026
www.mudranews.in | @mudranews



**టాలీవుడ్ లో నంబర్ హీరోయిన్ రష్మిక మందాన**

పాన్ ఇండియా క్రేజ్ తో పుష్ప తర్వాత భారీ ఫాలోయింగ్ సంపాదించింది. తెలుగు, హిందీ రెండింట్లో బిజీగా ఉంది. ప్రస్తుతం టాప్ రేంజ్‌లో ఉంది



# 'వీరభద్రుడు'గా సూర్య మాస్ ఎంట్రీ

**ముద్ర, సినిమా డెస్క్ :**



తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కరుప్పు' ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి హైప్ సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంతో పక్కా మాస్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం మే 14న వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇటీవల తమిళ సినిమాలను అదే పేర్లతో తెలుగులో విడుదల చేయడంపై వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకుని చిత్ర యూనిట్ కీలక నిర్ణయం తీసుకుంది.

తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరగా ఉండేలా ఈ సినిమాకు 'వీరభద్రుడు' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ టైటిల్ వినగానే మాస్, యాక్షన్ అంశాలు స్పష్టంగా అర్థమవుతుండటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ప్రత్యేకంగా మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.


ఈ చిత్రాన్ని ఆర్.జె. బాలాజీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు కంటెంట్ ప్రాధాన్యత ఉన్న సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఈసారి పూర్తి స్థాయి మాస్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. సూర్య సరసన త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ జంటకు ఉన్న క్రేజ్ కారణంగా సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి గ్రామీణ నేపథ్యానికి తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

వీరభద్రుడు'లో సూర్యకు ప్రత్యేకమైన యాక్షన్, భావోద్వేగాలు, గ్రామీణ వాతావరణం అన్నీ కలిసి ఒక పూర్తి వినోదాత్మక చిత్రంగా రూపొందుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తం మీద సూర్య – ఆర్.జె. బాలాజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఎంతటి విజయాన్ని సాధిస్తుందో చూడాలి.

# రాముడే కాదు.. పరశురాముడిగా కూడా


**రామాయణంలో రణ్‌బీర్ కపూర్ డబుల్ రోల్..**

**ముద్ర, సినిమా డెస్క్ :**



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ త్వరలో ప్రేక్షకులను ప్రత్యే కమైన పాత్రలతో అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పౌరాణిక చిత్రం 'రామా యణం'లో ఆయన డబుల్ రోల్‌లో కనిపించనున్నట్టు వెల్లడించాడు. హనుమాన్ జయంతి సందర్భంగా విడుదలైన 'రామ గ్లింప్స్' తర్వాత ఈ సినిమాపై సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ కొనసాగు తోంది. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో రణ్‌బీర్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో తాను కేవలం శ్రీరాముడి పాత్రలోనే కాకుండా, విష్ణుమూర్తి అవతారాల్లో ఒకటైన పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నానని చెప్పాడు. ఒకే సినిమాలో రెండు భిన్నమైన దివ్య పాత్రలు చేయడం తనకు ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నాడు. ఈ రెండు పాత్రల స్వభావం, బాడీ లాంగ్వేజ్ పూర్తిగా వేరుగా ఉండటంతో వాటిని అర్థం చేసుకోవడానికి షూటింగ్‌కు ముందు ఏడాది పాటు కష్టపడ్డానని వివరించాడు.


ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత నమిత్ మల్హోత్రా దాదాపు 4000 కోట్ల రూపాయల వ్యయంతో రెండు భాగాలుగా నిర్మిస్తున్నారు. సినిమాలో సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం మొదటి భాగం 2026 దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# 'పెద్ది' కోసం బుచ్చిబాబు కసరత్తు

**ముద్ర, సినిమా డెస్క్ :**

'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన గుర్తింపు సంపాదించిన బుచ్చిబాబు సనా, ఇప్పుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తో 'పెద్ది' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించగా, ఆ తేదీకి సినిమాను పూర్తి చేయాలనే లక్ష్యంతో దర్శకుడు తీవ్రంగా శ్రమిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సినిమా పనుల నిమిత్తం బుచ్చిబాబు సనా చెన్నైలో బిజీగా ఉన్నారని తెలిసింది. అక్కడి షెడ్యూల్ పూర్తి చేసిన తర్వాత ఆయన హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో 'పెద్ది'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ చిత్రంలో జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేంధు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కీలేరు నిర్మిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది.



# ప్రేమ నుంచి ప్రతీకారం దాకా..

**ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతున్న 'డెకాయిట్' ట్రైలర్**

**ముద్ర, సినిమా డెస్క్ :**

టాలీవుడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. షానిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంది. మొదట ఈ చిత్రం గత ఏడాది డిసెంబర్‌లో విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల చేయాలని మూవీ టీమ్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో విడుదలైన ట్రైలర్ సోషల్ మీడియాలో భారీ స్పందనను దక్కించుకుంటోంది.

ట్రైలర్ ప్రారంభంలో హరి, జూలియట్ పాత్రల మధ్య ఉన్న ప్రేమను హృద్యంగా చూపించారు. ఒకరినొకరు ఎంతో ప్రేమించుకుని, పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించే ఈ జంట, భవిష్యత్తు గురించి కూడా ఆశలు కట్టుకుంటుంది. అయితే కథ సాఫీగా సాగుతుందనుకునే సమయంలో అనుకోని మలుపు తిప్పుతూ హరి జీవితంలో భారీ మార్పు చోటు చేసుకుంటుంది.

కొన్ని పరిణామాల వల్ల హరి జైలుకు వెళ్లాల్సి రావడం కథలో కీలక మలుపుగా మారుతుంది. అతడు ఎందుకు జైలుకు వెళ్లాడు? ఆ సమయంలో జూలియట్ పరిస్థితి ఏమైంది? జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత హరి ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడు? వంటి అంశాలను ట్రైలర్‌లో ఉత్కంఠభరితంగా చూపించారు. అడివి శేష్, మృణాల్ మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉండగా, యాక్షన్ సన్ని వేశాలు, నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. మొత్తం మీద 'డెకాయిట్' ట్రైలర్‌తోనే మంచి హైప్ క్రియేట్ చేసి, విడుదలకు ముందే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేపుతోంది.

# ఒక్క హిట్టు కోసం భాగ్యశ్రీ ఎదురుచూపులు



ముద్ర, సినిమా డెస్క్ :

సినిమా ఇండస్ట్రీలో అందం, నటన రెండింటినీ సమానంగా మెప్పించగలిగే నటీమణులు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఒకరిగా నిలుస్తోంది. 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె, మొదటి చిత్రంతోనే తన అందం, అభినయంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.

ఆ తర్వాత 'కింగ్డమ్', 'కాంత', 'ఆంధ్ర కింగ్' వంటి చిత్రాల్లో నటిస్తూ తన ప్రతిభను మరింతగా నిరూపించుకుంది. గ్లామర్‌తో పాటు నటనకు కూడా ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న భాగ్యశ్రీ, తక్కువ సమయంలోనే మంచి అవకాశాలు అందుకుంటోంది. ప్రతి సినిమాలో విభిన్న పాత్రలు ప్రయత్నిస్తూ తనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే దిశగా అడుగులు వేస్తోంది.

అయితే ఇప్పటివరకు ఆమెకు భారీ స్థాయి విజయాన్ని అందించే సినిమా మాత్రం రాలేదు. అయినప్పటికీ ప్రేక్షకుల్లో ఈ యంగ్ హీరోయిన్‌కు మంచి క్రేజ్ ఏర్పడింది. ఒక బలమైన బ్లాక్‌బస్టర్ హిట్ దక్కితే, భాగ్యశ్రీ బోర్సే స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకోవడం ఖాయమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# శింబుకు జోడిగా..

**ముద్ర, సినిమా డెస్క్ :**

తమిళ హీరో శింబు మరో కొత్త ప్రాజెక్ట్‌తో వార్తల్లో నిలిచాడు. హిట్, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తూ వస్తున్న ఆయన, ఇప్పుడు కొత్త కాంబినేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఈసారి ఆయన సరసన 'కాంతార'తో గుర్తింపు పొందిన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించనున్నట్లు సమాచారం. దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కించనున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందని తెలుస్తోంది. 'ఓ మై కడవులే'తో మంచి పేరు తెచ్చుకున్న ఆయన, ఇటీవల 'డ్రాగన్'తో విజయాన్ని అందుకున్న తర్వాత శింబుతో సినిమా చేయడానికి రెడీ అవుతున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో కమెడియన్ సంతానం కూడా కీలక పాత్రలో కనిపించనున్నాడు. చాలా కాలం తర్వాత శింబు–సంతానం కాంబో మళ్లీ తెరపై కనిపించనుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాకు 'గాడ్ లవ్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద శింబు, రుక్మిణి వసంత్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి రేపుతోంది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com